



పట్టుబడిన నిందితుడు మునెయ్య, స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీసులు (ఫైల్)

ఓడీలతో.. ఎంజాయ్

- వైసీపీ హయాంలో ఆర్టీసీలో అడ్డగోలుగా మంజూరు
- గుంటూరు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల్లో 51 మంది..
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా కొనసాగుతున్న వైనం
- అక్రమ ఓడీలపై ఉన్నతాధికారులకు ఉద్యోగ సంఘ నేతల ఫిర్యాదులు



గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం.. దీర్ఘకాలిక రోగాలతో విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్) ఇస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో ఈ ఓడీలను ఇష్టం వచ్చినట్లుగా దుర్వినియోగం చేశారు. కొందరు వైసీపీ నేతల ఆదేశాలతో పలువురు ఉద్యోగులకు అధికారులు ఓడీలు ఇచ్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పలువురు ఉద్యోగులు అక్రమ ఓడీలతో ఎంచక్కా ఎంజాయ్ చేస్తుండడంపై ఓ ఉద్యోగ సంఘ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆర్టీసీలో ఓడీల మంజూరుకు సంబంధిత జోనల్ కార్యాలయం అనుమతి తప్పనిసరి. అయితే ఈ నిబంధనను పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమంగా ఓడీలు ఇచ్చేసినట్లు సమాచారం. ఇందులో అత్యధికంగా గుంటూరు-2 డిపోలో 24 మంది, గుంటూరు- 1 డిపోలో 9 మంది, తెనాలి డిపోలో ఏడుగురు, పొన్నూరు డిపోలో ఐదుగురు, మంగళగిరి డిపోలో ఆరుగురు మొత్తం 51 మంది ఉద్యోగులు తమ విధులను వదిలేసి అక్రమంగా ఓడీలు పొందుతూ ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. వీరంతా వారి సాధారణ విధులను వదిలేసి అందుకు భిన్నమైన తేలికపాటి విధుల్లో ఉన్నారు. కొందరైతే విధులకు రాకుండానే పూర్తిస్థాయిలో జీతాలు పొందుతున్నట్లు సమాచారం.

అర్హుల వినతులు బుట్టదాఖలు

మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లు, కండక్టర్లు తిరిగి సాధారణ విధులు నిర్వహించలేక తీవ్ర అనారోగ్యం పాలైన వారు, హృద్రోగులు, క్యాన్సర్ రోగులు సాధారణ డ్యూటీలు చేయడంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అటువంటి బాధితులు పెద్ద ఎత్తున ఆర్టీసీలో ఉన్నారు. (మిగతా 6వ పేజీలో..)

రికవరీలో.. గోల్‌మాల్?

ఓ బంగారు దుకాణంలో.. పదేళ్ల క్రితం కిలోకి పైగా బంగారం.. నాలుగు కిలోల వెండి.. 3.39 లక్షలకు పైగా నగదు చోరీ జరిగింది. అయితే ఆ చోరీకి పాల్పడిన దొంగను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. కానీ అతడి నుంచి 96 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా అందులో 40 గ్రాములకుపైగా నాసిరకమని తేలింది. దొంగ దొరికితే అతడు చోరీ చేసిన సొత్తు ఏమైందో పోలీసులు చెప్పడంలేదు. పైగా అరకొర సొత్తును తీసు కోవాలని పోలీసులు ఆ దుకాణ యజమానిపై ఒత్తిడి తెస్తున్నారు. రికవరీలో గోల్‌మాల్ జరిగిందని అందరికీ అర్థమవుతున్నా.. ఏదోలా కేసును క్లోజ్ చే యడంపైనే పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అంతపెద్దమొత్తంలో బంగారం, వెండి, నగదు చోరీ అయితే రికవరీలో భారీ తేడా ఎలా అన్న విషయంపై పోలీసు అధికారులు కనీసం ఆలో చించడం లేద ని.. ఇందులోనే మతలబు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసు ఉన్నతాధి కారులు స్పందించి ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తేనే ఈ చోరీ కేసుల రికవరీ వెనుక ఉన్న వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

- దొంగ దొరికాడు.. 96 గ్రాములే స్వాధీనం
- అందులో 40 గ్రాములకు మించి నాసిరకం బంగారం
- ఏడాదిగా తీసుకునేందుకు ముందుకు రాని యజమాని
- తీసుకోవాలంటూ బంగారు దుకాణదారుడిపై పోలీసుల ఒత్తిడి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ సొత్తు రికవరీలో అనేక అనుమానాలు.. పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. పోలీసు అధికారుల మీనమేషాలకు కారణమైన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం ఊటుకూరుకి చెందిన బొగ్గవరపు మణికంఠ అనే వ్యక్తి అచ్చంపేటలో గంగాభవాని జ్యువెలర్స్ అనే బంగారం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. 2014 నవంబరు 29న ఆయన షాపులో చోరీ జరిగింది. దొంగలు షాపులో కిలోకి పైగా బంగారపు ఆభరణాలు, నాలుగు కిలోల వెండితో పాటు 3 లక్షల 39 వేలకుపైగా నగదు అపహరించారు. అప్పట్లో ఈ చోరీ ఘటన ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. అదేరోజు అచ్చంపేట పోలీస్‌స్టేషన్లో క్రైమ్ నెంబరు 165/2014గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా పురోగతి లేకపోవడంతో బాధితుడు మణికంఠ అనేకసార్లు అప్పటి గుంటూరు రూరల్ ఎస్పీని, రేంజ్ ఐజీని అనేక దఫాలు కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ క్రమంలో 2022 ఫిబ్రవరి 12న గురజాలలో ఓ దుకాణంలో షాపు పైకప్పు తొలగించి 86 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల చోరీ జరిగింది. ఈ చోరీపై ప్రత్యేక దృష్టి సారించిన వినుకొండ, గురజాల, శావల్యాపురం, రూరల్ సీసీఎస్ పోలీసులకు 2022 మార్చి 6న శావల్యాపురం మండలం పిచ్చుకలపాలేనికి చెందిన కలువకూరి బాల మునెయ్య అలియాస్ బాలమణి పట్టుబడ్డాడు. నిందితుడని పోలీసులు విచారించగా సెల్‌ఫోన్ దుకాణంలో తరహాలోనే అచ్చంపేట, బాపట్ల, విజయనగరం జిల్లా కొత్తవలస తదితర ప్రాంతాల్లోని బంగారు షాపులకు పైకప్పు తొలగించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశారు. దీంతో అచ్చంపేటకు చెందిన బంగారు వ్యాపారి మణికంఠను సీసీఎస్ పోలీసులు గుంటూరుకు పిలిపించి దొంగ దొరికాడని అతడి వద్ద 280 గ్రాముల బంగారం రికవరీ చేశామని, ముత్తూట్, శ్రీరామ్ ఫైనాన్స్‌లలో వెండి తాకట్టు పెట్టాడని ఆ మొత్తాన్ని రికవరీ చేసి ఇస్తామని, డబ్బు మాత్రం రికవరీ చేయలేమని చెప్పారు. అయితే దుకాణంలో 1250 గ్రాముల బంగారం చోరీకి గురైతే కేవలం 280 గ్రాములే రికవరీ చేయడం ఏమిటని వ్యాపారి మణికంఠ పోలీసుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అతడి ఆవేదనన పట్టించుకోకుండా మునెయ్యను అరెస్టు చేసినట్లు ప్రకటించి మీడియా ఎదుట హాజరు పరిచారు. అచ్చంపేట కే సు ంక ం

పోలీసుల ఒత్తిడి

సంబంధించి 96 గ్రాములు, బాపట్లలో ఓ షాపులో జరిగిన చోరీలో 96 గ్రాముల బంగారం, కొత్తవలసలో జరిగిన చోరీ కేసులో రెండున్నర కిలోల వెండి, గురజాల కేసులో 86 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు రికవరీ చేశామని ప్రకటించారు. దీంతో అచ్చంపేటకు చెందిన వ్యాపారి షాక్‌కు గురయ్యారు. ఆభరణాలు చూసిన వ్యాపారి మరింత ఆందోళన చెందారు. అవి అత్యంత నాసిరకమైన 15 క్యారెట్ల బంగారు ఆభరణాలని, వాటిని కరిగిస్తే 40 గ్రాములకు మించి రాదని తేల్చారు. కనీసం ముందుగా చెప్పినట్లు 280 గ్రాముల బంగారం, నాలుగు కిలోలు (మిగతా 6వ పేజీలో..)

పోలీసుల తీరుపై అనుమానాలు..

సాధారణంగా చోరీ కేసుల్లో నగదు అపహరణకు గురైతే చేతులెత్తేయడం, ఆభరణాలు చోరీకి గురైతే కక్కించడం పోలీసులకు వెన్నతో పెట్టిన విద్య. మరి ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. చోరీ జరిగి సంవత్సరాలు గడుస్తుంది కదా.. షాప్ యజమాని ఆశలు వదులుకుని ఉంటాడు.. ఎంత ఇచ్చినా దక్కిందే దక్కుదల అని తీసేసుకుంటాడు.. అనుకున్నారో ఏమోగానీ పోలీసులు వ్యవహరించిన తీరు మాత్రం అలాగే ఉంది. చోరీ జరిగింది కొండంత... రికవరీ చేసింది మాత్రం కొసరంత. దీనిపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

భూ సమస్యలపై సదస్సులు

- నేటి నుంచి 33 రోజులు నిర్వహణ
- మండలంలో రోజుకో గ్రామంలో సభ
- ఈ సారైనా సమస్యలు పరిష్కారమయ్యేనా?



(నరసరావుపేట, గుంటూరు, ఆంధ్రజ్యోతి)

భూ వివాదాలతో రైతులు అల్లాడుతున్నారు. సర్వే సమస్యలతో యజమానులు సతమతమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేతో వివాదాలు, సమస్యలు మరింతగా పెరిగాయి. వాటి పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చూట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రీ సర్వేను నిలిపివేసింది. దీంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రైతులు కనీసం పంట రుణాలు పొందలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. శుక్రవారం నుంచి జనవరి 8 వరకు అంటే 33 రోజుల పాటు మండల పరిధిలో రోజుకో గ్రామంలో సదస్సు నిర్వహించేలా రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు గ్రామంలోనే అధికారులు అందుబాటులో ఉండనున్నారు. మండలాల వారీగా షెడ్యూల్‌ను తహసీల్దార్లు గురువారం విడుదల చేశారు. ఏఏ గ్రామాల్లో ఏ రోజు సదస్సు జరుగుతుందో ముందుగానే తెలియజేస్తారు. సదస్సుల నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. గుంటూరు జిల్లాలో కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడులో కలెక్టర్ పీ అరుణ్‌బాబు, బాపట్లలో కలెక్టర్ వెంకటమురళి పర్యవేక్షణలో సదస్సులు జరగనున్నాయి. సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్ల సమన్వయంలో జరిగే సదస్సులను సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు నిర్వహిస్తారు. ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, దేవదాయ, వక్ఫ్ బోర్డు, అటవీశాఖ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సదస్సులకు హాజరు కానున్నారు. మండల స్థాయిలో సదస్సుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించారు. సదస్సుల నిర్వహణపై గ్రామాల్లో ప్రచారం చేస్తారు. షెడ్యూల్‌కు అనుగుణంగా సదస్సుల్లో ఆయా గ్రామాల్లో రైతులు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కలెక్టర్, జేసీ నియోజకవర్గంలో కనీసం ఒక సదస్సుకు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సదస్సులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఫిర్యాదుల స్వీకరణ.. రశీదు..

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో జరిగే సభల్లో బాధితుల నుంచి భూ సమస్యలపై అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారు. గ్రామస్థాయిలో భూ వివాదాలు, 22 ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తారు. దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం అక్కడికక్కడే రశీదు జారీ చేస్తారు. సమస్య తీవ్రత ఆధారంగా పరిష్కారానికి గడువు ఉంటుంది. ముందుగానే ఆ గ్రామానికి సంబంధించి రెవెన్యూ రికార్డులు అడంగళ్, 22 ఏ జాబితా, 1బీ, హౌసింగ్, అసైన్డ్ ల్యాండ్, సబ్ డివిజన్, ఎఫ్ఎంబీ, మ్యాప్‌ల సమాచారం తయారు చేసి ప్రదర్శిస్తారు. గ్రామంలోని సమాచారం సరిగ్గా ఉందో లేదో ఈ రికార్డులతో రైతులు, ఇతర ల్యాండ్ యజమానులు వారి రికార్డులతో సరిచూసుకుని ఏమైనా తేడాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తే గ్రామ సభలో అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. గ్రామ సభ జరిగే గ్రామంలో సదస్సు జరిగే రోజు ఉచితంగా ఏపీ సేవ సర్వీసులు అందించనున్నారు. రైతులెవరికైనా సమస్యలు ఉంటే ఆ రోజు వరకు ఉచితంగా సమస్యలు పరిష్కరిస్తారు. ఈ సదస్సులు భూవివాదాలను నివారించేలా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆక్రమణలతో భూములు కోల్పోయిన బాధితులకు అండగా ఉండి న్యాయం చేస్తోందన్న భరోసా కల్పించేలా సదస్సులు ఉండనున్నాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణలు అమలు చేసే దిశగా సదస్సులు జరగనున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఇటీవల రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో వేల సంఖ్యలో అందిన అర్జీల పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో రెవెన్యూ సదస్సులపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ సారైనా తమ సమస్యలు పరిష్కారించాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా రెవెన్యూ యంత్రాంగం స్పందించకుంటే సదస్సు లక్ష్యాలు నీరుగారిపోతాయని చెప్పవచ్చు.



మిర్చియార్డులో జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు

మిర్చియార్డులో నిలువుదోపిడీ

- 2 శాతానికి బదులు 4 శాతం కమీషన్ వసూలు
- జీరో, కటింగ్ బిజినెస్‌లతో యార్డు ఆదాయానికి గండి
- ఏటా రూ.100 కోట్లపైగా నష్టమని మంత్రికి నివేదించిన రైతు ప్రతినిధులు
- మిర్చియార్డుని నాశనం చేసిన వారిపై చర్యలు : అచ్చెన్నాయుడు

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నిలువుదోపిడీ చేశారు. దిగుమతి వ్యాపారులు 2శాతానికి బదులు 4శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. బిల్లులు రాయకుండానే సరుకుని బయటకు తరలిస్తున్న సంఘటనలున్నాయి. వీటి వల్ల ఏటా రూ.100కోట్లకుపైగా యార్డుకు నష్టం వాటిల్లుతుంది. ఈ అక్రమాలను అరికడితే రైతుకు మేలు జరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడుకు రైతు ప్రతినిధులు తెలిపారు. యార్డులో రూ.347 కోట్ల కుంభకోణం జరిగిందని విజిలెన్స్‌తో మంత్రి గురువారం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యార్డు నుంచి లావాదేవీలు వేరే మార్కెట్లకు తరలిపోకుండా చర్యలు చేపడతామన్నారు. మిర్చి విలువని పెంచేందుకు ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు ఆలోచన చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విజిలెన్స్ నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు జారీ చేసిన 687 కమీషన్ ఏజెంట్ల లైసెన్సులను పరిశీలించి నిబంధనల మేరకు వ్యాపారం చేయని వారిని గుర్తించి రద్దు చేస్తామన్నారు. ఈ-నామ్‌ను తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. మిర్చియార్డుకు త్వరలోనే పాలకమండలి ఏర్పాటు చేస్తామన్నారు. యార్డు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని వేరే చోట ఏర్పాటు చేయాలని, అవసరమైతే రూ.100 కోట్లు సమీకరించి ఇస్తామని ఎగుమతి వ్యాపారులు తెలిపగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రత్తిపాడులో 250 ఎకరాలకు పైగా భూమిని సేకరించి ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రామాంజనేయులు చెప్పారు. శాసనసభ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యార్డులోని సమస్యలను పరిష్కరించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఐపీ పెట్టిన కమిషన్ ఏజెంట్లు, వారికి అనుమతి మంజూరు చేసిన ఉద్యోగుల నుంచి రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా నగదు వసూలు చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరి బుడితి రాజశేఖర్, తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, యార్డు పర్సన్ ఇన్‌చార్జి భార్గవతేజ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత, జేడీ శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, యార్డు కార్యదర్శి ఆంజనేయులు, ఏడీ రాజాబాబు, వ్యాపార సంఘాల ప్రతినిధులు అప్పిరెడ్డి, సుధాకర్, తోట రామకృష్ణ, వెలగపూడి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు నైతిక హక్కులేదు : అచ్చెన్నాయుడు

రైతులు గురించి మాట్లాడే నైతికహక్కు జగన్‌కు లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాశనం చేసిన వ్యవస్థని గాడిన పెడుతున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి 5 నెలలు చిల్లిగవ్వ చెల్లించకుండా, రూ.1600 కోట్ల అప్పు పెట్టిన దుర్మార్గుడని జగన్‌పై ధ్వజమెత్తారు. ఫెంగల్ తుఫానుతో తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. అమరావతిని గాడిన పెట్టి రూ.46 వేల కోట్ల పనులను సంక్రాంతి నుంచి ప్రారంభించబోతున్నామన్నారు.

వ్యాపారం చేసేది సగం మందే

యార్డులో పేరుకు 683 మందికి కమీషన్ ఏజెంట్ లైసెన్సులున్నా వారిలో సగం మంది కూడా వ్యాపారం చేయడం లేదని మంత్రి సమీక్షలో తేలింది. రైతులు తీసుకొస్తున్న సరుకు అంతా కొన్ని దుకాణాలకే వెళుతుండటంతో సీజన్‌లో రద్దీ తలెత్తుతున్నదని, ధర కూడా పెరగడం లేదని వెలుగులోకి వచ్చింది. వేమెన్లపై కొంతమంది ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ఫిర్యాదుతో వారు స్పందించి గణాంకాలతో సహా ఈ వివరాలను బయటకు తీశారు. దాంతో అంతా విస్తుబోయారు.

6
ముఖ్యమంత్రి పర్యటన
ఏర్పాట్ల పరిశీలన
- రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు రేపు ప్రారంభం
- బాపట్లలో కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం

ఏఎన్‌యూ వసతిగృహాలకు వార్డెన్ల నియామకం
- మహిళ, ఇంజనీరింగ్ వసతిగృహాల చీఫ్ వార్డెన్లుగా డాక్టర్ మాధవి, డాక్టర్ గోపికృష్ణ

8
అరుణాచలం, శబరిమలకు
ప్రత్యేక రైళ్లు
- కార్తీక దీపం, మండల పూజ, మకరవిలక్కు యాత్రికుల సౌకర్యార్థం


చిలకలూరిపేట బైపాస్ ప్రారంభం
- పేటవాసులకు తప్పిన ట్రాఫిక్ తిప్పలు



7
రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
వినుకొండ చీకటిగలపాలెం అడ్డరోడ్డు వద్ద ఘటన

టన్ను రూ. 600

- ఇసుక ధర దిగొచ్చింది
- 40 రోజుల్లో రూ.1,200 తగ్గిన ధర
- ఎప్పుడు.. ఎంత కావాలంటే అంత సరఫరా
- ఇక ప్రభుత్వ సరఫరాపై ఆధారపడాల్సిన అవసరం లేదు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇసుక ధర దిగొచ్చింది. రూ.600కే టన్ను ఇసుక సరఫరా చేస్తున్నారు. జిల్లాలో ఇసుక కష్టాలు తీరాయి. ప్రభుత్వ సరఫరాపై ఆధారపడాల్సిన అవసరం లేదు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఇసుక సరఫరా వెళ్లింది. ఎప్పుడు.. ఎంత కావాలంటే అంత ఇసుక టన్ను రూ.600కే సరఫరా చేస్తున్నారు. 40 రోజుల వ్యవధిలోనే ఇసుక ధర అమాంతం తగ్గింది. సెప్టెంబరులో టన్ను ఇసుక రూ.1,800కు విక్రయించారు. ప్రస్తుతం నరసరావుపేటకు టన్ను ఇసుక రూ.600 నుంచి రూ.650 ప్రైవేట్ వ్యక్తులు సరఫరా చేస్తున్నారు. 20 టన్నుల ఇసుక ధర 36,000 నుంచి 12,000కు తగ్గింది. పుష్కలంగా ఇసుక సరఫరా అవుతుండటంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుండానే కాల్ చేస్తే నాణ్యమైన ఇసుకను ఇంటికి సరఫరా చేస్తున్నారు. ఇసుక సరఫరాలో ప్రైవేట్ వ్యక్తుల మధ్య ఇదే తరహా పోటీ ఉంటే టన్నుకు రూ.50 నుంచి రూ.100 వరకు తగ్గే అవకాశం ఉందంటున్నారు. గతంలో లారీ ఇసుక రూ.8,000 నుంచి రూ.9,000 సరఫరా చేసేవారు.

అధికారికంగా రెండు రీచ్‌లే..

జిల్లాలో అధికారికంగా రెండు రీచ్‌లు మాత్రమే ప్రారంభమయ్యాయి. అంబడిపూడి, పొందుగల రీచ్‌లలో మైనింగ్‌శాఖ ఇసుక తవ్వకాలను నిర్వహిస్తోంది. వీటి నుంచి సరఫరా అయ్యే ఇసుక మాత్రమే మైనింగ్‌శాఖ లెక్కల్లో కనిపిస్తోంది. ఉదాహరణకు నరసరావుపేటకు రోజు 50నుంచి 60 లారీలు వరకు ఇసుక వస్తోంది. ఇదంటా మైనింగ్‌శాఖ లెక్కల్లో ఉండదు. ప్రైవేట్ వ్యక్తులు అమరావతి ప్రాంతం నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమమార్గంలో సరఫరా చేస్తున్నారు. కృష్ణా జిల్లా నుంచి కూడా ఇసుక సరఫరా అవుతోంది. అయితే ప్రైవేట్ వ్యక్తులు ఇసుక సరఫరా చేస్తుండటం వల్లే ఇసుక ధర తగ్గిందని నిర్మాణదారులు చెబుతున్నారు. లారీకి 20 టన్నుల నిబంధనను సడలించారు. ఇది కూడా ధర తగ్గడానికి ఒక కారణంగా ఉంది. ప్రస్తుతం ఒక్కొక్క లారీ ద్వారా 30 నుంచి 35 టన్నుల వరకు ఇసుక సరఫరా చేస్తున్నారు. 20 టన్నులకైనా 35 టన్నులకైనా రవాణా ఖర్చు ఒక్కటే. దీంతో అధికంగా ఇసుక లోడ్ చేసి సరఫరా చేస్తుండటం వల్లే ఇసుక ధర తగ్గిందంటున్నారు. ఇసుక సరఫరా ఏ మార్గంలో జరుగుతున్నా అంతిమంగా ధర తగ్గడంతో నిర్మాణదారులపై ఆర్థిక భారం తగ్గుతోందని చెప్పవచ్చు. ఇసుక సరఫరాపై ఉన్న వ్యతిరేకత క్రమంగా తగ్గిపోతుంది. ఇదే రకంగా ఇసుక సరఫరా కొనసాగితే ఇంకా ధర తగ్గే అవకాశం ఉంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

జగన్ పశ్చాత్తాప యాత్ర చేస్తే బాగుంటుంది

- ఏపీ దోపిడీ దొంగ ఎవరంటే జగన్ పేరు మోత మోగుతుంది
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ 'పోరుబాట'కు బదులు 'పశ్చాత్తాప' యాత్ర, 'క్షమాపణ' యాత్ర మోకాళ్లపై చేస్తే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 'పోరుబాట'కు పిలుపు నివ్వడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. పోరుబాట పేరుతో జగన్ శాంతిభద్రతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట అంటున్న జగన్ తన హయాంలో విద్యుత్ చార్జీలు 8 సార్లు ఎందుకు పెంచారో, వ్యవసాయ రంగానికి రూ.10 వేల కోట్లు బకాయిలు ఎందుకు పెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఉరి శిక్ష వేశారని అన్నారు. యువతను గంజాయి మత్తుకు బానిసలు చేరని ఆరోపించారు. గత ప్రభుత్వంలో రూ.3,500 కోట్ల ఫీజ్ చెల్లించకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీలో నిలిచిపోయాయని గుర్తుచేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని, రాష్ట్రంలో విద్యార్థులను రోడ్డున పడేసింది జగనేనని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు జగన్‌కి ఒక్కసారి అవకాశమిస్తే యువతకు ఉపాధి లేకుండా చేశారని, నేడు యువత ఉద్యోగాలు లేక అల్లాడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరుబాట పెట్టినా ప్రజలు జగన్‌ను క్షమించరని అన్నారు. ధాన్యానికి జగన్ పెట్టిన రూ.1600 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన మోసాలు కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. జగన్ ఓడిపోయిన తర్వాత ఆత్మపరిశీలన చేసుకోక పోగా దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర బ్రాండ్ ఇమేజీని దెబ్బతీయాలని, రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయాలని జగన్ కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ దోపిడీ దొంగ ఎవరని ప్రశ్నిస్తే జగన్ పేరు మోత మోగుతుందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 4 వేలకు పెంచి లబ్దిదారులకు అందిస్తున్నామన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని చెప్పారు. సమావేశంలో ఏపీ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, వేముల కొండ శ్రీనివాస్, బొబ్బిలి రామారావు, దామచర్ల శ్రీనివాసరావు, కే.ఎం.ఈ హస్సేన్, మన్నవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- రాష్ట్ర వ్యాప్తంగా రేపు మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభం
- బాపట్లలో కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

బాపట్లరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న మెగాపేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభం కానున్నాయి. బాపట్లలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, సభావేదిక ఏర్పా ట్లను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు గురువారం పరిశీలించారు. మెగా విద్యార్థుల పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు వస్తున్నందున పాఠశాల తరగతి గదులు విద్యార్థుల తల్లులకు నిర్వహించే రంగవల్లులు, తండ్రులకు నిర్వహించే టగ్గాఫ్ వార్ పోటీల నిర్వాహణ, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి.వెంకటమురళి అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే కార్యక్రమానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, సభావేదిక, ప్రాంగణం ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో 919 మంది విద్యార్థులు నమోదు కాగా ప్రస్తుతం 818 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని మంత్రులకు కలెక్టర్ వివరించారు. తరగతి గదుల విశాలంగా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పీఏ సిస్టమ్ నడిపించడంలో అవాంతరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి మంత్రి ఆదేశించారు. మీడియా పాస్‌లివ్వడంలో సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ బాపట్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ హెచ్‌ఆర్‌డీ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధి, పిల్లల చదువులు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించటానికే రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. విద్యార్థులు నిర్లిప్తంగా ఉంటే అందుకు కారణాలు, వారిలో అసంతృప్తి, ఏయే సబ్జెక్టులలో బలహీనంగా ఉన్నారో గుర్తించి వారిని సరైన మార్గాలలోకి తెచ్చేలా తల్లిదండ్రులతో చర్చించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ నేర్పేలా తల్లిదండ్రులకు వ్యక్తిగత క్రమశిక్షణ అలవర్చడం, వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ఎన్‌సీఆర్‌టీ నిబంధనల ప్రకా రం పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందో లేదో క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం, సరైనవిధానంలో విద్యాబోధన సాగుతుందో లేదో తెలుసుకుంటామన్నారు. పూర్వవిద్యార్థులను గుర్తించి ఆహ్వానించడం, అభినందించటం ద్వారా వారిని ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. రాజకీయపార్టీల ప్రమేయం లేకుండా సాదాసీదాగా ఈ కార్యక్రమం నిర్వహించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 2014నుంచి 2019 వరకు బాపట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఫలితాలు 90 శాతం పైగా ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరోన తర్వాత ఫలితాలు 29 శాతానికి పడిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో నిబంధనల మేరకు ఉపాధ్యాయులను నియమించడం, విద్యాబోధనపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని, ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ఇదేనని మంత్రి వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, బుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, మాజీ శాసన సభ్యుడు చీరాల గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు

విస్తృత ఏర్పాట్లు

మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాల అధికారుల ఆధీనంలోకి వెళ్ళిపోయింది. మున్సిపల్ హైస్కూల్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఆధునీకరిస్తున్నారు. అధికారులు, నాయకులు కలిసి పాఠశాలను సందర్శించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు వచ్చే ముఖ్యమంత్రి ఏ కార్యాలయాన్ని సందర్శిస్తారోనని అందరు సిద్ధమవుతున్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితర అధికారులు, నాయకులు పాఠశాలను తరుచుగా సందర్శిస్తున్నారు. విద్యాశాఖ చీఫ్ సెక్రటరి కోన శశిధర్ ఆదేశాల మేరకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించే పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను ప్రత్యేకంగా చేశారు. సభావేదిక ప్రాంగణాన్ని అలంకరిస్తున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, జిల్లా క్రీడాధికారి పాల్‌కుమార్ ఉన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్

- మీడియా సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌పై గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వ హించారు. అంతకుముందు ఈ కార్యక్రమం నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్‌జీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచే లక్ష్యంతో ఈ నెల 7 నుంచి మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక విద్యార్థి పాఠశాలలో ఎలా చదువుతున్నాడు, అక్కడ టీచర్లు ఎలా చూస్తున్నారు, విద్యార్థి ఏ విధంగా మెరుగవుతున్నాడో వారి తల్లితండ్రులకు తెలియజేయడానికి ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో వినూత్నంగా రూపొందించిన హోలీస్టిక్ ప్రోగ్రాం కార్డులతో వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ప్రతి పిల్లవాడికి ఏడవ తేదీ ఉదయం తరగతి గదిలో ఇస్తారని తెలిపారు. పేరెంట్స్ వచ్చి స్కూల్ వాతావరణం, అక్కడ వుండే సౌకర్యాలు, ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు వంటి విషయాలను స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ వారు తెలియజేస్తారన్నారు.



రాజకీయ పార్టీలు, ఎన్‌జీవోల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

ప్రజా ప్రతినిధులు, దాతలు, ఓల్డ్ స్టూడెంట్స్ కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటారన్నారు. జిల్లాలోని 1064 హై స్కూల్స్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి, జిల్లా విద్యా శాఖాధికారిణి సీవీ రేణుక పాల్గొన్నారు.

పర్యావరణ శాస్త్రవేత్త పంకజ్‌కు సీఐఐ అవార్డు



కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ పంకజ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పంకజ్ పాఠక్‌కు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక సీఐఐ 4ఆర్ అవార్డు లభించింది. కేంద్ర పరిశోధనా రంగ సహకారంతో భారతీయ వాణిజ్య మండలి (సీఐఐ) ఇటీవల న్యూఢిల్లీలో వ్యర్థాల నుంచి సంపద సృష్టించే సాంకేతికతపై 9వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి భూపేందర్ యాదవ్ శాస్త్రవేత్తల సేవలను కొనియాడుతూ అవార్డులను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ పంకజ్ పాఠక్ గడిచిన ఆరేళ్లుగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల సమగ్ర నిర్వహణపై పరిశోధనలు చేస్తున్నారు. ఎక్స్‌లెన్స్ ఇన్ ఇన్నోవేషన్ సొల్యూషన్స్‌పై ఆమె తయారు చేసిన పత్రాలను పరిశీలించిన సీఐఐ కేంద్ర కార్యాలయం 2024 వార్షిక సంవత్సరానికి డాక్టర్ పంకజ్‌ను పరిశోధన, విద్యా సంస్థల కేటగిరీలో అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ పంకజ్‌కు ఎస్‌ఆర్‌ఎం అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్, వీసీ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్‌లు అభినందనలు తెలిపారు.

జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందించి వివరిస్తున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు రోడ్లను జాతీయ రహదార్లుగా అభివృద్ధి చేయాలని కోరుతూ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదార్ల శాఖా మంత్రి నితిన్ గడ్కరీని వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో హైవే రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి అమరావతి ఓఆర్ఆర్‌కి ప్రత్యేక కనెక్టివిటీ, మచిలీపట్నం ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హర్బర్, చీరాల ఓడరేవు, చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమలు, ఒంగోలు సమీపంలోని ఎన్‌హెచ్ 16కు కలుపుతూ ఎన్‌హెచ్ 216ను 4లైన్‌ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మృతి చెందిన గుర్రం కోటేశ్వరరావు

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి పంచాయతీ సమీపంలో రైతు ఉత్పత్తిదారుల సేవాసంఘం ఎదురు రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సం ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం మండలంలోని బొలయపాలెంకు చెందిన గుర్రం కోటేశ్వరరావు చందోలు నుంచి యాజలి వైపు వస్తుండగా యాజలికి చెందిన నందిపాటి శ్రీరామ్ సునీల్ ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొనడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శ్రీరామ్ సునీల్‌ను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. కోటేశ్వరరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇరువురికి వివాహమైంది.

ప్రేమ పేరిట మోసం.. ఎఎన్‌యూ గెస్ట్ ఫ్యాకల్టీపై కేసు

పెదకాకాని, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ఓ గెస్ట్ ఫ్యాకల్టీ ఓ విద్యార్థినిని ప్రేమి స్తున్నానంటూ వెంటపడి, పెళ్లి చేసుకుంటానని నమ్మ బలికి, అవసరం తీరాక మొహం చాటేస్తున్న ఘటనపై పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. పెదకాకాని మండలం నంబూరుకి చెందిన కోడూరు పృథ్వీరాజ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలో ఇంజనీరింగ్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉద్యోగం చేస్తున్నాడు. నెల రోజుల క్రితం అతనికి ఈ ఉద్యోగం లభించింది. ఈ విశ్వవిద్యాలయంలోనే ఓ విద్యార్థిని ఎంటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. పృథ్వీరాజ్, ఆ విద్యార్థిని మధ్య 2020 నుంచి స్నేహం ఏర్పడింది. స్నేహం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడు. పెళ్లి చేసుకోమని ఆ విద్యార్థిని ఒత్తిడి చేయడంతో బుకాయించాడు. దీంతో, బాధితురాలు నేరుగా పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు తెలియజేసింది. ఈ మేరకు గెస్ట్ ఫ్యాకల్టీ పృథ్వీరాజ్ పై పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్ వీసీ నాగభూషణ్, యలమంచిలి శ్రీనివాసరావు తదితరులు

విజ్ఞాన్స్ వర్సిటీ, థెరల్లెన్ ఫార్మాల అవగాహన ఒప్పందం

- ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవం అందిస్తాం
- వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్

గుంటూరు(విద్య),డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని థెరల్లెన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని బుధవారం వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో థెరల్లెన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ యలమంచిలి శ్రీనివాసరావుతో యూనివర్సిటీ డీన్ పీసీఎఫ్ డాక్టర్ దిరిశాల విజయరాము అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారని తెలియజేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. హైదరాబాద్‌లోని థెరల్లెన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ యలమంచిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదు ఇవ్వడమే ఈ ఒప్పందం లక్ష్యం అని అన్నారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరేశ్వరునికి కార్తీకమాస ఆదాయం రూ.1.8 కోట్లు



హుండీలో కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అమరేశ్వరుని దర్శించిన భక్తుల నుంచి వివిధ రూపాలలో రూ.1,83,74,220 ఆదాయం లభించినట్లు దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పీ సునీల్ కుమార్ తెలిపారు. గురువారం జరిగిన హుండీల లెక్కింపులో రూ.57,10,061, ప్రత్యేక దర్శనాలతో రూ. 52,83, 400, ప్రత్యక్ష అభిషేకంతో రూ17,05,800, పరోక్ష అభిషేకంతో రూ14,06,160, లడ్డు ప్రసాదంతో రూ22,64,400, పులి హోర ప్రసాదంతో రూ20,310, అన్నదాన విరాళం రూ13,71,304, లక్షబిల్వార్చనతో 3,51,364, విరాళాలు, ఇతర సేవలతో రూ.2,61,421 ఆదాయం లభించినట్లు వివరించారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఓడీలతో.. ఎంజాయ్

(5 పేజీ తరువాయి)

తమ పరిస్థితిని చూసి మానవత్వంతో ఓడీలు కల్పించాలని చేసిన విజ్ఞప్తులను కొందరు డిపో మేనేజర్లు బుట్టదాఖలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అవయవాలన్నీ బాగున్న వారికి, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని వారికి మాత్రం వైసీపీ హయాంలో ఓడీలు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. ఆయా డిపోల్లో డిపో మేనేజర్లకు వత్తాసు పలికే 'కట్టప్ప'లకు, వైసీపీ విధేయులకు మాత్రం అడ్డగోలుగా ఓడీలు కల్పించేశారన్న ఆరోపణలున్నాయి.

అక్రమ ఓడీలపై నోరెత్తని నాయకులు..

అక్రమ ఓడీలతో ఎంజాయ్ చేస్తోన్న కొందరు యూనియన్ నాయకులు సంస్థలో సిబ్బంది పడుతోన్న సమస్యలను ప్రశ్నించకుండా మిన్నకుండిపోతున్నారన్న విమర్శలున్నాయి. డిపోల్లో సమస్యలైన టాయిలెట్స్, తాగునీరు, రెస్ట్ రూమ్స్, రన్నింగ్ టైం సమస్యలు, బస్సుల కండిషన్‌లాంటి సమస్యలు అడిగే నాథుడే కరువయ్యారు. కేవలం కొద్ది మంది మెప్పుకోసం వైసీపీ హయాంలో విచ్చలవిడిగా చేసిన అక్రమ ఓడీల వ్యవహారంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ వలంటీర్‌పై కేసు నమోదు

అమరావతి, డిసెంబరు 5:(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన నాయకులు నాగబాబుపై అసభ్యకరపోస్టులు పెట్టిన అమరావతి రాజీవ్‌కాలనీకి చెందిన వైసీపీ వలంటీర్ కంభంపాటి శంకర్ కుమారుడు దినేష్‌పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇదే కాలనీకి చెందిన జనసేన అభిమాని లాం వంశీ, తమ నాయకులపై దినేష్ మూడు నెలలుగా అసభ్యకరపోస్టులు పెడుతున్నాడని ఆధారాలతో పోలీసులకు బుధవారం పిర్యాదు చేశారు. వంశీ పిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎం శ్రీనివాసరావు దినేష్‌పై 351(2), 352,353(1) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96.104.115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

రికవరీలో.. గోల్‌మాల్?

(5 పేజీ తరువాయి)

వెండి కూడా ఇవ్వకుండా కేవలం 96 గ్రాములు రికవరీ చూపడం ఏమిటని వాపోయారు.

రూ.8 లక్షల ఖర్చు..

దుకాణంలో చోరీ జరిగిన బంగారం కోసం ఇప్పటివరకు వ్యాపారి మణికంఠ ఎనిమిదేళ్లు తిరిగారు. రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశారని సమాచారం. అయితే పోలీసులు చూపుతున్న 96 గ్రాముల నాసిరకం బంగారం తీసుకుంటే కనీసం తాను ఖర్చు పెట్టిన డబ్బులు కూడా రావని వాపోతున్నారు. ఈ బంగారాన్ని తీసుకోవాలని ఏడాదిగా పోలీసులు ఒత్తిడి తెస్తుండగా అతను ససేమిరా అంటున్నారు. ఇప్పుడు ఆ ఆభరణాలను తీసుకుంటే ఇంకా కొంతమంది చేతులు తడపాల్సి ఉంటుందని, దీంతో ఆ మొత్తం అందుకే సరిపోతుందని మణికంఠ భయపడుతున్నారు.

పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు

అచ్చంపేట భారీ కేసులో దొంగ దొరికినా పోలీసులు కేవలం 96 గ్రాములు అదీ నాసిరకం బంగారాన్ని మాత్రమే రికవరీ చూపిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చోరీ కేసుల్లో బంగారం రికవరీలో 10 గ్రాములో.. 20 గ్రాములో రికవరీలో తేడా ఉన్నా పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. కానీ కిలోకి పైగా బంగారు ఆభరణాలు చోరీకి గురైతే కేవలం 96 గ్రాముల నాసిరకం బంగారు ఆభరణాలు చూపడం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ 96 గ్రాముల బంగా రాన్ని తీసుకునేందుకు బాధితుడు ముందుకు రాకపోయినా ఉన్నతాధి కారుల్లో స్పందన లేకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రెండేళ్లుగా పోలీసులు ఆ బంగారం తీసుకెళ్లాలని, లేదంటే తామే కోర్టుకు లెటర్ పెట్టి బాక్స్‌లో వేస్తా మని వ్యాపారిపై ఒత్తిడి తెస్తున్నారు. లేదంటే బంగారం తీసుకున్నట్లుగా లెటర్‌పై సంతకం చేస్తే చాలని దాన్ని తాము ప్రజోపయోగ కార్యక్రమా లకు వినియోగిస్తామని గతంలో కొందరు పోలీస్ అధికారులు మణికంఠను ప్రలోభ పెట్టడం గమనార్హం.



అప్పట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

సమగ్ర విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..

అచ్చంపేట, బాపట్ల, కొత్తవలస దుకాణాల్లో జరిగిన చోరీ కేసులు అన్నింటిపైనా పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అచ్చంపేటకు చెందిన వ్యాపారిని గుంటూరుకు పోలీసులు పిలిపించిన సమయంలో 280 గ్రాములు ఇస్తామని చెప్పారు. అయితే ఆ తర్వాత అచ్చంపేట, బాపట్ల దుకాణాల్లో జరిగిన చోరీలకు సంబంధించి రికవరీ చేసిన బంగారమంతా కూడా 192 గ్రాములే ఉండడం గమనార్హం. ముందుగా చెప్పిన 280 గ్రాములు ఏమైనట్లు అనేది కూడా మరో ప్రశ్నగా ఉంది.

52,275 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 49,078 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,275 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 38,121 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15000	334	7700	14500
నెంబరు. 5	8000	13000	నెంబరు.5	8000	14000
273	10000	15000	273	8000	11000
341	7700	13400	341	8000	13000
4884	11500	12500	4884	8000	14000
సూపర్ 10	9500	9500	సూపర్ 10	9800	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	9000	13700	దేవనూరు డీలక్స్	9000	12500
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	10000

ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాలు

కారంపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదకొదమగుండ్లలో గురువారం ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాలను జరిపారు. మండల కోఆర్డినేటర్ సుబ్బారావు ఆధ్వర్యాన గ్రామంలో ర్యాలీ జరిపి మరుగుదొడ్డి ఆవశ్యకతను వివరించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సత్యనారాయణరాజు, పంచాయతీ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మాచర్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీ నుంచి మండల పరిధిలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ వాణి తెలిపారు. ఈనెల 6, 7 తేదీల్లో కంభంపాడు, 10న ముత్యాలంపాడు, 11న రాయవరం, 12న అమ్మానీ జమ్మలమడక, 13, 17న కొత్తపల్లి, 18, 19న కొప్పునూరు, 20, 21న నాగులవరం, 24, 26, 27, 28న పశువేముల, 31వ తేదీన తాళ్లపల్లి గ్రామాలకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. జనవరి 2న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెల్దుర్తి మండల పరిధిలో..

వెల్దుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు తహసీల్దార్ బాష తెలిపారు.

గురజాల మండల పరిధిలో..

గురజాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఈనెల 6 నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నగేష్ తెలిపారు.

కారంపూడి మండల పరిధిలో..

కారంపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. శుక్రవారం నరమాలపాడులో ఈ సదస్సులు ప్రారంభమవుతుండగా శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని చెప్పారు.

సత్తెనపల్లి మండలంలో..

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, జనవరి 3 రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి గురువారం తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాల వద్ద సదస్సులు జరుగుతాయని చెప్పారు. 6న పెద మక్కెన, 7న గుడిపూడి, 10న నందిగామ, 11న కంటెపూడి, 12న కొమెరపూడి, 13న లక్కరాజుగార్లపాడు, 17న భీమవరం, 18న కంకణాలపల్లి, 19న ధూళిపాళ్ళ, 20న బృగుబండ, 21న పాకాలపాడు, 26న రెంటపాళ్ళ, 27న అబ్బూరు, 28న ఫణిదం, 31న భట్లూరు, జనవరి 2 కట్టమూరు, గోరంట్ల, 3న సత్తెనపల్లి, వడ్డవల్లిలో గ్రామసభలు జరుగుతాయన్నారు.

బెల్లంకొండ మండలంలో...

బెల్లంకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నుంచి బెల్లంకొండ మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ మున్నీసా బేగం పేర్కొన్నారు. 6న నాగిరెడ్డిపాలెం, 10న నందిరాజుపాలెం, 11న గంగిరెడ్డిపాలెం, 12న బోదనం, 13న కందిపాడు, 17న చంద్రాజుపాలెం, 18న మన్నె సుల్తాన్‌పాలెం, 19న యమ్మాజీగూడెం, 20న వెంకటాయపాలెం, 26న పాపాయపాలెం, 27న వన్నాయపాలెం, 28న మాచాయపాలెం, 31న ఆర్‌అండ్‌ఆర్ సెంటర్, జనవరి 3న బెల్లంకొండలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

క్రోసూరు మండల పరిధిలో...

క్రోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్రీనివాస యాదవ్ తెలిపారు. 6న 88 తాళ్ళూరు, ఉయ్యందన, 7న అనంతవరం, హసానాబాద్, 10న గుడిపాడు, గాదెవారిపాలెం, 11న నాగవరం, గరికపాడు, 12న అందుకూరు, బాలెమర్రు, 13న విప్పర్ల, ఊటుకూరు, 17న బయ్యవరం, 18న దొడ్లేరు, 19న ఆవులవారిపాలెం, పెరికపాడు, 20న క్రోసూరు, 21న యర్రబాలెం, 23న పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో జరుగుతాయన్నారు.

అమరావతిలో...

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. 6న వైకుంఠపురం, 7న పెదమద్దూరు, 10న ఎండ్రాయి, 11న నరుకుళ్లపాడు, 12న కర్లపూడి, 13న ఉంగుటూరు, 17న నెమలికల్లు, 18న అత్తలూరు, 19న మునగోడు, 20న జూపూడి, 21న మల్లాది, పొందుగల, 24న దిడుగు, 26, 27న ధరణికోట, 28, 2న అమరావతి, 3న లింగాపురం గ్రామాలలోని సచివాలయాలలో జరుగుతాయని తెలిపారు.

నేడు జానపాడులో..

పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జె.మధుబాబు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సుకు శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

నకరికల్లు మండలంలో..

నకరికల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.పుల్లారావు గురువారం తెలిపారు. 6న చాగల్లు, కండ్లకుంట, 10న చీమలమర్రి, 12న దేచవరం, 13న రూబెనగుంట్ల, 17న చల్లగుండ్ల, 18న కుంకులగుంట-1, 2, 19న చేజర్ల, 21న నర్సింగపాడు, 24న త్రిపురాపురం, 27న గుండ్లపల్లి-1, 2, 28న నకరికల్లు-1, 2 సచివాలయాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చే లక్ష్యంగా పురపాలక సంఘం పనిచేస్తుందని కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. గురువారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించి పలు దుకాణదారులతో మాట్లాడారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు

- సీనియర్లకు ప్రాధాన్యం
- మిగిలిన వారికి మరికొన్ని కమిటీల్లో స్థానం
- కూటమి నేతల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్లలో కూటమి నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ అరాచకత్వానికి అడ్డుగా నిలిచి గత 20 ఏళ్లుగా నా వెంట, పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ అనేక కష్టనష్టాలు పడ్డవారెవరో తనకు తెలుసునని, అలాంటి వారికి గుర్తింపు ఇస్తానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం పిడుగురాళ్లలోని కల్యాణ మండపంలో గురజాల నియోజకవర్గ స్థాయి ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని, రైతులకు ప్రాముఖ్యత, అనుభవం, సీనియర్ నాయకులు, రైతుల కష్టాలు తెలిసిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. చివరి ఆయకట్టు భూమి వరకు సాగునీరు అందించే లక్ష్యంగా పార్టీలో కొంతమందిని నీటి సంఘాల ఎన్నికల పదవులకు ఎంపిక చేయనున్నట్లు యరపతినేని తెలిపారు. అదేవిధంగా 10 సొసైటీలలో త్రీమెన్ కమిటీ సభ్యుల ఎంపిక కూడా ముఖ్యనేతలు ఉమ్మడిగా చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆ తరువాత మార్కెట్ కమిటీల ఎంపిక, మరికొందరికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ డైరెక్టర్లు, స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచుల పదవులకు ఒక్కొక్కరిని ఎంపిక చేస్తానని, అందరికీ ప్రాధాన్యత ఇస్తామన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 700 మందికి అన్నిట్లో పదవులు కల్పించనున్నట్లు, మరో 500 మంది నిరుద్యోగులకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఒక్కరికీ ఇల్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తుందని, పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోనైనా ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని, ఎంతమంది ఉన్నా అందరికీ దశల వారీగా గృహాలు మంజూరవుతాయన్నారు. ఒక్కో గ్రామంలో ఒక్కొక్క విధంగా సమస్య ఉంటుందనీ, ఒక్కో సమస్యను ఒక్కో నాయకుడికి బాధ్యతను అప్పగించి ఆ అధికారికి అనుసంధానం చేసి ఆ సమస్య తీర్చేలా కమిటీ సభ్యులను నియమించనున్నట్లు యరపతినేని తెలిపారు.

కొందరికి కుటుంబ పోషణ అందిస్తా...

రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల కష్టాలు తెలుసునని, ప్రతి కార్యకర్త కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీలో కష్టపడి పనిచేసి చదువులేని ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారిని గుర్తించి వారి కుటుంబ పోషణకు చేయూతగా ఉంటానని యరపతినేని తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా పార్టీ ముఖ్యులు, కార్యకర్తలతో యరపతినేని సమావేశమయ్యారు. డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, జంగా వెంకట కోటయ్య, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పులుకూరి కాంతారావు, పాండురంగ శ్రీను, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, బెల్లంకొండ భద్రి, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సాంబశివరావు, వేముల వినోద్‌రెడ్డి, అడపా శ్రీను, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, బీజేపీ వెంకయ్య, హనుమంతరావు, ఉన్నం సురేష్, ఎల్‌వీఆర్, తురకా వీరస్వామి, షేక్ బాబావలి, చింతపల్లి హసన్ అహ్మద్, తంగెళ్ల శ్రీను, అమీర్‌అలి, నారాయణ, శివ, ఉన్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంపు ఘనత సీఎం చంద్రబాబుదే

● శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అండగా నిలిచేందుకు రూ. 3 వేలు ఉన్న దివ్యాంగ పింఛన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 6 వేలకు పెంచారని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో గురువారం అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యాన నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలోనే వారి కోసం మంచి కార్యక్రమం చేపట్టబోతున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం దివ్యాంగులకు హెల్త్ కార్డులను అందించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు పాషావలి, అన్వర్ బాషా, మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మేకల దాసు, కొమెర అనంతరాములు, శివ, చల్లా రాజారత్నం, బాబుఖాన్, జల్లెల కొండలు, గోపవరపు చెన్న, పల్నాడు, ప్రతిభ, వికాస్ కళాశాలల డైరెక్టర్ పఠాన్ నాగూర్‌వలి, మన్నెం పాండురంగారావు, రామకృష్ణ, వేముల శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, చినలాలుసాహెబ్, అంజిబాబు, శివశంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో అందరం ఐక్యంగా పని చేసి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో గురువారం సాయంత్రం పట్టణ స్థాయి టీడీపీ సభ్యత్వ సమీక్షా, నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని టీడీపీ కార్యకర్తగా గర్వపడదామన్నారు. నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నూర్ బాషా జాన్ బాబు, సయ్యద్ పెద కరిముల్లా, రాంబో బుడే, బండారు నాగరాజు, ఎంవీ చలపతిరావు, అబ్దుల్లా, పూజల వెంకట కోటయ్య, కొండ్రగుంట రంగారావు, దరువూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం


సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఎంతో గొప్పవని, ఆచరణీయమైనవని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీలో గురువారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే కన్నా కట్ చేశారు. గ్రామ, మండల ఎస్సీ సెల్ నాయకులు, మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాంబశివరావు మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఇరపని సాంబశివరావు మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివరావు మృతి బాధాకరం అన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పుట్టి సతీష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తుమ్మల ఏడుకొండలు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, పచ్చల వెంకటేశ్వర్లు ఉన్నారు.

నిరుపేదలను ఆదుకోవటమే సీఎంఆర్ఎఫ్ లక్ష్యం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారినపడిన నిరుపేదలను ఆదుకోవటమే సీఎంఆర్ఎఫ్ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండలానికి చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. మండలంలోని 88 తాళ్ళూరుకు చెందిన నీలం రమేష్‌కు రూ.1,02,619, ఊరే స్వరాజ్యానికి రూ.2 లక్షలు, నల్లమేకల శివ కోటేశ్వరరావుకు రూ.27,070 సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో నియోజకవర్గ అభివృద్ధి

అచ్చంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి ఏర్పాటైతే పెదకూరపాడు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, దీని ద్వారా ఎన్‌టీఆర్, సూర్యాపేట, పల్నాడు జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యాలు మెరుగవుతాయని, అనంతరం డిజిటల్ మ్యాప్‌లు పరిశీలించి అప్రోచ్ రోడ్డు మార్గాన్ని తనిఖీ చేశారు. టీడీపీ నాయకుడు పసుపులేటి పాపిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, గంధం కోటేశ్వరరావు, కొలగాని సత్యనారాయణ, తిరువాయిపాటి ఆంజనేయులు, పాపిరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

వినుకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం చీకటీగలపాలెం అడ్డరోడ్డు సమీపంలో బ్రిడ్జిపై బొలెరో వాహనం పంచరు అయింది. వాహనం పంచరు వేసుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. మృతులు కొత్తపాలెం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఆనంద్, వెంకటకృష్ణారెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

ఫ్యాప్టో నేతల నిరసన

మాచర్లటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థుల దాడిని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) నేతలు ఖండించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారావు, గంగాధరబాబు, నజీర్, నాసరయ్య, రమేష్, శ్రీనివాసరావు, కోర్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాయచోటిలో ఉపాధ్యాయునిపై విద్యార్థులు దాడి చేసిన సంఘటన తమను ఎంతో కలచి వేసిందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య నాయకులు గురువారం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలన్నారు. ఉపాధ్యాయుడు అహమ్మద్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సమైక్య నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

అచ్చంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడిపై దాడి చేసిన విద్యార్థులను తక్షణమే శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘాల వారు గురువారం డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం స్థానిక ఎంఈవో ఏకుల ప్రసాదరావుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయునికి న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయ నేతలు గంధం గంగయ్య, పి.శౌరిరెడ్డి, బత్తుల సాంబశివరావు, సునీల్ బాబు, రామ్మోహన్, దేవరాజు, వేణుగోపాలరావు తదితరులు ఉన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు అహమ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో గురువారం క్రోసూరు ఎంఈవోకు వినతి పత్రం సమర్పించారు. తరగతి గదిలో విద్యార్థులు ఘర్షణ పడుతుండగా సర్దిచెప్పబోయిన ఉపాధ్యాయుడిపై దాడి చేశారని అన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా శ్రీనివాసరావు

క్రోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా జి. శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈవోపీఆర్‌డీగా పని చేస్తున్న ఆయన ఇక్కడ ఎంపీడీవో మహేష్ బాబు పదవీ విరమణ చేయటంతో ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. శ్రీనివాసరావును మండల పరిషత్ ఉద్యోగులు పూల బొకేలు అందజేసి అభినందించారు.

రూబెనగుంట్ల యువకుడికి బంగారు పతకం

నకరికల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మారి ప్రజారోగ్య శాస్త్రంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నకరికల్లు మండలం రూబెనగుంట్ల గ్రామానికి చెందిన గోగా అనిల్‌కు తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ బంగారు పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేసింది. నవంబరు 30న తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ 9వ స్నాతకోత్సవంలో ఛాన్సలర్ డాక్టర్ పద్మనాభన్ చేతులమీదుగా గోగా అనిల్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గోగా అనిల్ ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో గర్భధారణ సమయంలో వచ్చే గుండె జబ్బులకు చికిత్సా విధానంపై అధ్యయనం చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 586.40 అడుగులు ఉంది. ఇది 302.39 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4814 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,253 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 39,934 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 39,934 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విజేతగా బ్రహ్మనాయుడు సీసీ టీం



క్రికెట్ టోర్నమెంట్ విజేత టీంకు బహుమతులు అందిస్తున్న కూటమి నేతలు

కారంపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని కారంపూడి పట్టణంలో కూటమి నేతలు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో బ్రహ్మనాయుడు సీసీ టీం విజేతగా నిలిచింది. వెంగళబాల సీసీ టీం రన్నరప్‌గా, లక్కీసీసీ టీం మూడోస్థానంలో నిలిచాయి.

హోరాహోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కారంపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కారంపూడిలో కూటమి నేతలు ఆధ్వర్యాన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 35 జట్లు పాల్గొన్నాయి. కారంపూడి బ్రహ్మనాయుడు జట్టు విజేతగా నిలవగా రూ.30 వేలను బహుమతిగా అందించారు. విజయవాడకు చెందిన కృష్ణ కింగ్స్ ద్వితీయ స్థానంలో నిలవగా రూ.20 వేలు, కారంపూడికి చెందిన మస్తాన్ టీం మూడో స్థానంలో నిలవగా రూ.15 వేలు, కారంపూడికి చెందిన డీఎస్ఎస్ టీం నాలుగో స్థానంలో నిలవగా రూ.10 వేలను అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, జనసేన సమన్వయకర్త బూసా రామాంజినేయులు, కర్లా సైదారావు, లక్ష్మయ్య, ఎస్ఎంకే నాయుడు, ఉన్నం లక్ష్మీనారాయణ, చింతపల్లి షేక్ రఫీ, మస్తాన్, అంకిరాజు, చప్పిడి రాము, కేశానుపల్లి కృష్ణబాబు పాల్గొన్నారు.

నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి



సీఎం చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న శ్రీలక్ష్మి

అచ్చంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామస్తురాలు జోనబోయిన శ్రీలక్ష్మి తన కుమారునికి రెండు కిడ్నీలు చెడిపోయాయని, ఆదుకుని ప్రాణ బిక్ష పెట్టాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం మొర పెట్టుకుంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించారు. లక్ష్మీ కుమారుడు నాగ వెంకట్‌కు 11 సంవత్సరాలు. ఈ బాలునికి రెండు కిడ్నీలు చెడి పోవటంతో ఆస్పత్రుల్లో సంప్రదించగా వైద్యానికి రూ.16 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు నిర్ధారించారు. ఈ క్రమంలో ఆమె తన వద్ద ఉన్న డబ్బులు, కొంత అప్పు చేసి రూ.5 లక్షలు వైద్యానికి ఖర్చు పెట్టారు. మిగిలిన వైద్యానికి స్తోమత లేని కారణంగా ముఖ్యమంత్రిని ఆశ్రయించింది. దీనికి స్పందించిన సీఎం సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద రూ .10 లక్షలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో ఇది సాధ్యమైందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుని కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

బెల్లంకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో రెండు రోజుల క్రితం మృతిచెందిన సంగం డెయిరీ పాల సభ్యుడైన సపావత్ రాములు నాయక్ కుటుంబానికి సంగం డెయిరీ బీమా స్కీమ్‌కు సంబంధించి రూ.60 వేలు మంజూరైనట్లు సంగం డెయిరీ, బీసీ పాయింట్ ఇన్‌ఛార్జి మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం మృతుడు రాములు నాయక్ కుటుంబ సభ్యులకు రూ.10వేలు నగదును అందజేశారు. మిగిలిన రూ.50 వేలు కొద్ది రోజుల్లో కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తామని మేనేజర్ పేర్కొన్నారు. మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, సంగం డెయిరీ సూపర్‌వైజర్ సుధీర్, బాబూ నాయక్, సపావత్ ప్రసాదు నాయక్, సపావత్ నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఈనెల 6వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో టి.శ్రీలత గురువారం తెలిపారు. నందిగామ(ఎస్సీ), గర్నెపూడి(ఓసీ), గండ్లూరు(బీసీఏ), ఫణిదం (బీసీడీ), లక్కరాజుగార్లపాడు(ఎస్సీ), వెన్నాదేవి(ఓసీ) అంగన్ వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆమె తెలిపారు. మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, జూలై 1, 2024 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 లోపు వయస్సు ఉండాలన్నారు. ఈనెల 8, 14, 15 తేదీల్లో సెలవులు మినహాయించి 18వ తేదీ లోపు సాయంత్రం 5 గంటల కల్లా సమగ్ర శిశు సేవా పథకం వారి కార్యాలయంలో తమ దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సత్తెనపల్లిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నకరికల్లు మండలంలో..

నకరికల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సత్తెనపల్లి ఐసీడీఎస్ సీడీపీవో టి.శ్రీలత తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీల వివరాలు... మొక్కపాడు (ఓసీ), చాగల్లు (ఓసీ)కి కేటాయించారు. ఆయా పోస్టులు ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెం(ఓసీ), మాదల 87 కేంద్రం (ఓసీ) , రుద్రవరం 94 కేంద్రం (ఓసీ), మాదల 88 కేంద్రం (ఎస్టీ), రాజుపాలెం మండలంలోని రాజుపాలెం-01 (ఎస్టీ), మొక్కపాడు 48 (బీసీ-డి), నెమలిపురి-15 (ఓసీ), ఇనిమెట్ల-46 (బీసీ-ఇ), నకరికల్లు మండలంలోని దేచవరం-176 (బీసీ-డి), చల్లగుండ్ల-168 (బీసీ-ఇ), కండ్లకుంట-182 (ఎస్సీ), గుండ్లపల్లి-263 (బీసీ-ఇ), కుంకలగుంట-195 (ఎస్సీ), సత్తెనపల్లి రూరల్ మండలంలో నందిగామ-135 (ఎస్టీ), గర్నెపూడి-191(ఓసీ), గండ్లూరు-150లో (బీసీ-ఎ), ఫణిదెం-158 (బీసీ-డి), లక్కరాజుగార్లపాడు-175 ఎస్సీ, వెన్నాదేవి-170 (ఓసీ) కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

మోర్జంపాడులో టీడీపీ సభ్యత్వ నమోదు

మాచవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు గ్రామంలో గత పది రోజులుగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామం మొత్తం మీద 1900 సభ్యత్వాలు టార్గెట్ ఇవ్వగా ఇప్పటికి సుమారు ఎనిమిది వందల వరకు పూర్తి చేసినట్టు స్థానిక నాయకులు తెలిపారు. మిగిలిన సభ్యత్వాలను కూడా రెండు మూడు రోజుల్లో పూర్తి చేసి టార్గెట్ పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వాలు నమోదు చేస్తున్నారు. రూ.100 పెట్టి సభ్యత్వం తీసుకోవటం వల్ల పార్టీ పరంగా కుటుంబానికి అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని, ప్రమాదవశాత్తూ మరణిస్తే పార్టీ పరంగా రూ. 5 లక్షల వరకు ప్రమాద బీమా లభిస్తుందని గ్రామంలో ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గడిపూడి శ్రీకాంత్, గడిపూడి సైదయ్య, గాడిపర్తి నరసింహారావు, డి.చెన్నయ్య చౌదరి, గుర్రం రామారావు ఉన్నారు.

సేంద్రియ ఎరువులను వాడండి



రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేస్తున్న ఏవో పాపకుమారి

దాచేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని దాచేపల్లి మండల వ్యవసాయ అధికారిణి పాపకుమారి గురువారం రైతులకు తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికూడి గ్రామంలో అంతర్జాతీయ మృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏవో మాట్లాడుతూ మట్టిని సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ దానిని జాగ్రత్తగా సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ ప్రతి ఏడాది డిసెంబరు 5న అంతర్జాతీయ మృతిక దినోత్సవం నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

గురజాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అదృశ్యంపై గురజాల పోలీస్‌స్టేషన్లో గురువారం కేసు నమోదైంది. మండలంలోని పల్లెగుంతకు చెందిన ముత్యాలంపాటి ఫాతిమా గురజాల పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ మాదిరిగానే ఈ నెల 4వ తేదీన కళాశాలకు అని ఇంట్లో చెప్పి బయలుదేరింది. అయితే అదే రోజు మధ్యాహ్నం కళాశాల అధ్యాపకురాలు ఫాతిమా తండ్రి హుస్సేన్‌కు మీ కుమార్తె కళాశాలకు రాలేదేంటని ఫోన్ చేసింది. దీంతో ఫాతిమా తల్లిదండ్రులు తమ కుమార్తె ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారికి ఫోన్ చేసినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం గురజాల పోలీస్‌స్టేషన్లో తమ కుమార్తె కనిపించడం లేదంటూ ఫాతిమా తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మంచినీటి ప్లాంట్ ప్రారంభం

సత్తెనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 6న పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో ఆల్కలైన్ మంచినీటి ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభిస్తారని టీడీపీ పట్టణ కార్యదర్శి నూర్ బాషా జానీ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ట్రస్ట్ డైరెక్టర్లు కన్నా నాగరాజు, కన్నా ఫణీంద్ర, ఎస్పీ కె.శ్రీనివాసరావు హాజరవుతారని ఆయన తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని అచ్చంపేట వెళ్లే మార్గంలోని నిర్మల్ నగర్ రైలు పట్టాలపై గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుని జేబులో సత్తెనపల్లి వరకు బుధవారం రాత్రి బస్సులో ప్రయాణించినట్టుగా టిక్కెట్ ఉందన్నారు. మృతుని వయస్సు 65 సంవత్సరాలు ఉంటాయన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు రైల్వే ఏఎస్ఐ వెంకటరావు తెలిపారు.

మరపురాని.. మహానటి



నేడు సావిత్రి జయంతి

సావిత్రి అంటే మహానటి.. మహానటి అంటే సావిత్రి. ఈ రెండూ ఒకదానికొకటి పర్యాయపదాలు అంటే అతిశయోక్తి కాదనిపిస్తుంది. పలు చిత్రాల్లో విభిన్నమైన పాత్రల్లో తన నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించేలా చేసిన సావిత్రి జయంతి నేడు. సావిత్రి జయంతిని పురస్కరించుకుని ఆమె జ్ఞాపకాలను తీరప్రాంత ప్రజలు గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఎన్నో దానధర్మాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేసింది. రేపల్లె మండలంలోని వడ్డివారి పాలెం సావిత్రి తల్లి సుభద్రమ్మ స్వగ్రామం. ఈ గ్రామంలో 1962లో శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సావిత్రి స్థాపించింది. ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుని తమ జీవితాలకు బాటలు వేసుకున్నారు.

- 1962లో వడ్డివారిపాలెంలో స్థాపించిన సావిత్రి గణేష్ జడ్పీ ఉన్నత పాఠశాల
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు
- జిలాల్లోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు



పాఠశాలలో ఏర్పాటు చేసిన సావిత్రి విగ్రహం



సావిత్రి నాటిన అశ్వత్థ వృక్షం వద్ద సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి (ఫైల్)

అశ్వత్థ వృక్షం నాటిన సావిత్రి

పాఠశాల ప్రారంభించిన మరుసటి సంవత్సరం 1963లో ఆ పాఠశాల ప్రాంగణంలో సావిత్రి ఓ అశ్వత్థ వృక్షం నాటింది. అప్పటి నుండి పలుమార్లు పాఠశాలకు వచ్చి అక్కడి బాగోగులు చూస్తుం డేది. ఈ గ్రామంలోని పుట్టింటి వారి బంధువులకు ఆర్థికంగా సావిత్రి చేయూత నిచ్చింది. సావిత్రి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం వడ్డివారిపాలెం పాఠశాలకు కుమార్తె విజయచాముండేశ్వరి, భర్త గోవిందరావు ఈ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు కొంత ఆర్థికసాయంతో పాటు పాఠశాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. 1981 డిసెంబర్ 26వ తేదీన సావిత్రి తుది శ్వాస విడిచారు.

రేపల్లె,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సినీ నటి సావిత్రి 1936 డిసెంబరు 6న తాడేపల్లి మండలం చిర్రావూరులో నిశంకరం గురవయ్య, సుభద్రమ్మలకు మొదటి సంతానంగా జన్మించింది. వందలాది సినిమాల్లో హీరోయిన్‌గా వివిధ పాత్రల్లో నటించి తన నటనా కౌశలంతో ఎంతో పేరు గడించింది. 1955లో జెమిని గణేష్‌ను వివాహం చేసుకుంది. సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, కుమారుడు సతీష్‌కుమార్. సొంత ఊరిని, తల్లిదండ్రులను మరవకూడదనే ఉద్దేశంతో సావిత్రి తన తల్లి స్వగ్రామం అయిన రేపల్లె మండలం వడ్డివారిపాలెంలో శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 1962లో స్థాపించింది. వేలాది విద్యార్థుల జీవితాలకు బాటలు వేసింది. జిల్లాలోనే ఆదర్శవంతమైన పాఠశాలగా పేరు పొందింది. దినదినాభివృద్ధి చెందుతూ సరస్వతీ నిలయంగా విరాజిల్లుతున్న ఈ పాఠశాల పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలను గత పదేళ్లుగా సాధిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిలుస్తోంది. తొలుత ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ పొందింది. అప్పటి నుండి తీరప్రాంతంలో ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఇంటికి ఒకరు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాఠశాల నుంచి ప్రతి సంవత్సరం 30 నుంచి 40 మంది పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ పలు పాఠశాలలకు ఆదర్శంగా నిలు స్తోంది. 2015-16 సంవత్సరంలో హాజరైన 31 మంది విద్యార్థులూ వంద శాతం ఉత్తీర్ణతతోపాటు 9.5 జీపీఏ సాధించారు. 2016-17లో 27 మంది, 2017-18లో 38 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత పొందారు. ముప్పై ఎనిమిది మందిలో ఐదుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు కూడా లభించాయి. ముగ్గురు విద్యార్థులు 10 జీపీ సాధించారు. 2019 నుంచి 2023 వరకు పదో తరగతిలోనూ నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం ఈ పాఠశాల సత్తాను తెలియ జేస్తుంది. అంతేకాకుండా, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, తైక్వాండో తదితర క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గెలుపొంది ఈ పాఠశాలకు గుర్తింపు తీసుకొస్తున్నారు.



శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

76 మంది మగ ఆరోగ్య కార్యకర్తలు విధుల నుంచి తొలగింపు

గుంటూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైద్య , ఆరోగ్య శాఖలో మగ ఆరోగ్య కార్యకర్తలగా పనిచేస్తున్న 76 మందిని విధుల నుండి తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి ఉత్తర్వులు విడుదల చేశారు. విధుల నుంచి తొలగించిన మగ ఆరోగ్య కార్యకర్తలు గత ఇరవై ఏళ్లుగా ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. జీఓ నంబర్ 1207ను గత వారంలో హైదరాబాద్ హైకోర్టు పక్కన పెట్టడంతో దాని ద్వారా నియ మితులైన ఆరోగ్య కార్యకర్తలను యుద్ధప్రాతిపదికన విధుల నుంచి తొలగించారు. ఈ ఉత్తర్వులు ఆయా ఉద్యోగులకు వెంటనే అంద జేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విషయమై కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తలు స్పందిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబు తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దృష్టికి కోర్టు తీర్పు విషయాన్ని తీసుకువెళ్ళకుండా ఉన్న పళంగా రోడ్డున పడవేశారని ఆరోపించారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది 50 సంవత్సరాలు దాటిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ఈ వయస్సులో ఎలా బతకాలి.. కుటుంబాన్ని ఏవిధంగా పోషించు కోవాలని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


మెమూ రైళ్ల అనవసర నిలుపుదల

గుంటూరు ఎస్ఎస్‌పై ప్రయాణికుల ఆగ్రహం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాత్రి వేళ గుంటూరు-విజయవాడ మధ్యన ప్రయాణించే మెమూ రైలుని రైల్వే వర్గాలు అనవసరంగా నిలుపుదల చేస్తున్నాయి. ఈ రైలు నిత్యం సాయంత్రం వేళ మాచర్ల నుంచి బయలుదేరి రాత్రి 7.45కి గుంటూరుకు వస్తుంది. ఆ తర్వాత నంబరు మార్చి గుంటూరులో 8.10కి బయలుదేరి రాత్రి 9.25కి విజయవాడ చేరుకునేలా టైంటేబుల్ రూపొందించారు. ఈ రైలు గుంటూరులో మూడు రోజుల నుంచి గంటకు పైగా ఆలస్యంగా బయలు దేరుతుంది. అందుకుగల కారణాలను ఎవరూ చెప్పడం లేదు. అదేమంటే వేరే బోగీలు, లోకోని జత చేయా లని సమాధానం చెబుతున్నట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విష యంపై గురువారం రాత్రి ప్రయాణికులు స్టేషన్ సూపర్‌వైజర్‌ని నిలదీశారు.

ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



వట్టిచెరుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్ని తరా లకు ఆదర్శప్రాయుడు శ్రీరామ చంద్రుడు అని ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచించారు. మండలంలోని వింజనంపాడులోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీరామ నాయ సప్తాహ మహోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మూడు లోకాలలో అత్యంత శక్తివంతుడు శ్రీరాముడని, అయినా తండ్రి మాట దాటడన్నారు. కష్టాలను ఓర్చుకుని బతకాలని శ్రీరాముడి కథ నేర్పుతుందని చెప్పారు. నేటి తరం శ్రీరాముని కథ తెలుసుకుని తలిదండ్రులపై బాధ్యతగా మెలగాలని హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. రామాయణంతో మన జీవితం ముడిపడిందని, ప్రతి ఒక్కరూ పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రుడు చిరుమామిళ్ల వెంకటరత్నం, కిట్స్ కళాశాల చైర్మన్ కోయా సుబ్బారావు, కార్యదర్శి కోయా శేఖర్, ఉగ్గిరాల సీతారామయ్య, రాయపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

మిల్లుల్లో ఖాళీ లేదు

ధాన్యం రైతుల పరిస్థితి అగమ్యగోచరం

అమ్మకాలు 50 వేల ఎంటీలే.. మిగులు 2.40 లక్షల మెట్రిక్ టన్నులు

తేమ శాతం ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయాలన్న ముఖ్యమంత్రి

గుంటూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు స్థల సమస్య అడ్డంకిగా మారింది. మిల్లుల్లో ఖాళీ లేకపోవడంతో కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోవడం రైతులకు శాపంగా మారుతుంది. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు తెలుస్తోంది. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు కొనుగోలుకు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. రైతుల వద్ద ఇంకా 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరి సాగు కాగా, సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని తెలుస్తోంది.

కొనుగోళ్లపై సీఎం సమీక్ష

ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం కలెక్టర్ నాగలక్ష్మితో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. భారీ రైతుల శ్రేయస్సు దృష్ట్యా తేమ శాతం ఎక్కువున్నా ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని, రైతు నష్టపోకుడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రొక్యుర్మెంట్ సప్పోర్టింగ్ ఏజేన్సి వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులలో అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు కనీస మద్దతు ధరకంటే తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని వారికి తెలియజేయాలని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొనే సమస్యలపై వెంటనే స్పందించి, కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగేలా చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జి.లక్ష్మి, జిల్లా సప్లయాస్ అధికారి కోమలి పద్మ, బిజినెస్ మేనేజర్ హరిగోపాలం పాల్గొన్నారు.



సీఎంతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

టోల్ ఫ్రీ నెంబర్

రైతులు ధాన్యం విక్రయాల్లో వచ్చిన ఇబ్బందుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రైతులు తమ సమస్యలను 9491392717కి ఫోన్ చేసి ఫిర్యాదులు చేస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

మిర్చి లారీని మళ్లీ అడ్డుకున్న యూనియన్ నాయకులు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి లారీల యూనియన్‌కు చెందిన కొందరు నాయకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పోలీసులు ఎంత చెప్పినా వీరి చెవికి ఎక్కడం లేదు. తమ యూనియన్‌తో సంబంధం లేకుండా మిర్చి లారీని ఎవరైనా లోడింగ్‌కు పెడితే ఆ వాహనాన్ని అడ్డుకొంటున్నారు. గురువారం రాత్రి పెదకాకాని సమీపంలో ఇలాంటి సంఘటనే జరిగింది. యూనియన్‌తో సంబంధం లేకుండా ఒక ఎగుమతిదారుడు ఈశాన్య రాష్ట్రాలకు మిర్చిని ఎగుమతి చేసేందుకు లారీ లోడింగ్ చేసుకొంటుండగా తమ అనుమతి లేకుండా ఎలా చేస్తారంటూ వెళ్లి అడ్డుకొన్నారు. కాగా గురువారం ఉదయం ఈ అంశంపై ఎగుమతిదారులు మంత్రి అచ్చెన్నాయుడుకు నివేదించారు. దీనిపై తాను రవాణ శాఖ కమిషనర్‌తో మాట్లాడతానని హామి కూడా ఇచ్చారు అయితే గంటల వ్యవధిలోనే యూనియన్ నాయకులు లారీనఇ అడ్డుకోవడం అధికార యంత్రాంగం చేతకానితనాన్ని తేటతెల్లం చేస్తున్నది.

10న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక బీ ఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 16, 18, 20 బాల, బాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు, రెండు ఫొటోలు తీసుకుని అదే రోజున ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలన్నారు.

చిలకలూరిపేట బైపాస్ ప్రారంభం

పేటవాసులకు తప్పిన ట్రాఫిక్ తిప్పలు

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.1,000 కోట్లతో 16.38 కిలోమీటర్ల పొడవున మార్టూరు యడ్లపాడు మధ్య రామచంద్రాపురం నుంచి తిమ్మాపురం వరకు నిర్మించిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డుపై గురువారం సాయంత్రం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. గత నెల 29న విశాఖ నుంచి ప్రధాని నరేంద్రమోదీ చేత రిమోట్ ద్వారా ప్రారంభింపచేయాలని అధికారులు తలపెట్టారు. అయితే ప్రధాని కార్యక్రమం రద్దు కావడంతో అది ఆగిపోయింది. అయితే చిలకలూరిపేట పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జటిలమవుతుండడంతో నేషనల్ హైవేస్ ఉన్నతాధికారులు అకస్మాత్తుగా జారీ చేసిన ఆదేశాల మేరకు బైపాస్‌పై రాకపోకలకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. నేషనల్ హైవేస్ పీడీ పార్వతీశం స్వయంగా వచ్చి బైపాస్‌పై ఉన్న అడ్డంకులను క్రేన్లతో తొలగింపచేసి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యేలా చూశారు. బైపాస్ రోడ్డులో రాకపోకలు ప్రారంభం కావడంతో చిలకలూరిపేట ప్రజలకు ఎన్నో ఏళ్లుగా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డు

చిలకలూరిపేట బైపాస్ దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డుగా రూపొందింది. అత్యంత సుందరంగా దీనిని నిర్మించారు. ఒంగోలు నుంచి గుంటూరు వచ్చే మార్గంలో ఎడమ వైపున ఒకవైపే సర్వీస్ రోడ్డు నిర్మించారు. మధ్యలో గ్రామాలు, రోడ్లు ఉన్న ప్రాంతాల్లో మాత్రం రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణం జరిగింది. గణపవరం వద్ద రోడ్డు పక్కన ఉన్న విశాలమైన ప్రదేశంలో మెగా వాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. రోడ్డు పొడవునా ట్రీగార్డులతో 3,500 మొక్కలు నాటారు. అధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మూడు ఫ్లైఓవర్లు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణం జరిగింది. బైపాస్ కారణంగా ఒంగోలు - గుంటూరు మధ్య ప్రయాణం చేసే వారికి సుమారు 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది.



నరసరావుపేట రోడ్డులో నిర్మించిన అండర్ పాస్

నేటి నుంచి విజయ్ మర్చంట్ ట్రోఫీ

మంగళగిరి, మూలపాడులో ఏసీఏ ఏర్పాట్లు పూర్తి

మంగళగిరి సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ దేశవాళీ టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీ గ్రూపు-డీ మ్యాచ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రోఫీకి సంబంధించి మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, మూలపాడులోని డీవీఆర్, సీపీ మైదానాలను సిద్ధం చేశారు. 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటక-విదర్భ (మంగళగిరి), రాజస్థాన్-జార్ఖండ్(డీవీఆర్), అస్సాం-ఉత్తరాఖండ్(సీపీ), 11 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్-ఉత్తరాఖండ్ (మంగళగిరి), ఝార్ఖండ్-కర్ణాటక(డీవీఆర్), జమ్మూకశ్మీర్-విదర్భ (మూలపాడు సీపీ), 17 నుంచి 19 వరకు రాజస్థాన్-విదర్భ (మంగళగిరి), జమ్మూకశ్మీర్-కర్ణాటక (డీవీఆర్), జార్ఖండ్-ఉత్తరాఖండ్(సీపీ), 22 నుంచి 24 వరకు కర్ణాటక-ఉత్తరాఖండ్(మంగళగిరి), రాజస్థాన్-జమ్మూకశ్మీర్ (డీవీఆర్), జార్ఖండ్-విదర్భ (సీపీ), 28 నుంచి 30 వరకు జమ్మూకశ్మీర్-జార్ఖండ్(మంగళగిరి), ఉత్తరాఖండ్-విదర్భ (డీవీఆర్), రాజస్థాన్-కర్ణాటక(సీపీ) మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు.

అరుణాచలం వెళ్లే యాత్రికులకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అరుణాచల క్షేత్రంలో ఈ నెల 13న కార్తీగై దీపం(తమిళ క్యాలెండర్ ప్రకారం కార్తీక దీపం) జరగనున్న దృష్ట్యా అక్కడికి వెళ్లే యాత్రికుల సౌలభ్యం కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలుని నడపనున్నట్లు ప్రకటించింది. నంబరు 07601 సికింద్రాబాద్ - విల్లుపురం ప్రత్యేక రైలు ఈ నెల 12న(గురువారం) రాత్రి 7.40కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి మీదగా అర్ధరాత్రి 12.10కి గుంటూరు చేరుకుంటుంది. అనంతరం 12.20కి బయలుదేరి శుక్రవారం ఉదయం 11.50కి తిరువణ్ణామలై, మధ్యాహ్నం 1.05కి విల్లుపురం చేరుకుంటుంది. నంబరు.07602 విల్లుపురం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 13న శుక్రవారం సాయంత్రం 4.05కి బయలుదేరి శనివారం వేకువజామున 3 గంటలకు గుంటూరు, 3.49కి సత్తెనపల్లి, 4.49కి నడికుడి, ఉదయం 9.40కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

మండల పూజకు ప్రత్యేక రైళ్లు

శబరిమలలో మండలం పూజ, మకరవిలక్కు పండుగలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నంబరు.07193 మౌలాలి - కొల్లం రైలు ఈ నెల 11, 18, 25 తేదీల్లో నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. నంబరు 07194 కొల్లం - మౌలాలి రైలు ఈ నెల 13, 20, 27 తేదీల్లో అక్కడ బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. నంబరు. 07149 మౌలాలి - కొల్లం రైలు ఈ నెల 14, 21, 28 తేదీల్లో, నంబరు. 07150 కొల్లం - మౌలాలి రైలు ఈ నెల 16, 23, 30 తేదీల్లో అక్కడ బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. నంబరు.07155 కాకినాడ టౌన్ - కొల్లం రైలు జనవరి 6, 13 తేదీల్లో, నంబరు.07156 కొల్లం - కాకినాడ టౌన్ రైలు జనవరి 8, 15 తేదీల్లో, నంబరు.07157 నరసపూర్ - కొల్లం రైలు జనవరి 20, 27 తేదీల్లో, నంబరు.07158 కొల్లం - నరసపూర్ రైలు జనవరి 22, 29 తేదీల్లో బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణిస్తాయి.

ఏఎన్‌యూ వసతిగృహాలకు వార్డెన్ల నియామకం


మహిళ, ఇంజనీరింగ్ వసతిగృహాల చీఫ్ వార్డెన్లుగా డాక్టర్ మాధవి, డాక్టర్ గోపికృష్ణ

పెదకాకాని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వసతిగృహాలకు నూతనంగా వార్డెన్ల నియామకం జరిగింది. మహిళా వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై ఇటీవల విద్యార్థులను ఆందోళనల నేపథ్యంతో వర్సిటీ అధికారులు తాజాగా నిర్ణయం తీసుకున్నారు. మహిళా వసతి గృహాలకు చీఫ్ వార్డెన్‌తో పాటు అడిషనల్ చీఫ్‌వార్డెన్, డిప్యూటీ వార్డెన్లను నియమిస్తూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్‌గా బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ జె.మాధవి నియమితులయ్యారు. అదనపు చీఫ్ వార్డెన్‌గా డాక్టర్ వై.సునీత(ఇంజనీరింగ్ కాలేజ్), డాక్టర్ ఎస్.సుజన(ఫార్మసీ కళాశాల), డిప్యూటీ వార్డెన్లుగా డాక్టర్ ఏఎస్‌వీ రాధిక, డాక్టర్ వి.సుభాషిణి, ఝాన్సీలను నియమించారు. ఇంజనీరింగ్ కళాశాలకు చీఫ్ వార్డెన్‌గా అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణను నియమించారు. అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ డీ చంద్రమౌళికి అడిషనల్ చీఫ్ వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ వార్డెన్లుగా ఆర్.విజయ్‌ప్రకాష్, యు.సతీష్‌కుమార్, కేఎస్.రాజశేఖర్, డాక్టర్ సీహెచ్ పుణ్యశేఖర్, డాక్టర్ బి.విజయకుమార్‌లను నియమించారు. ఏడాది పాటు వీరు వార్డెన్లుగా విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చేనేత పూర్వవైభవానికి మంత్రి లోకేశ్ కృషి

శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్ధయ్య

మంగళగిరి సిటీ, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖల ఆధ్వర్యంలో మంగళగిరి టిడ్కో సముదాయంలోని కమ్యూనిటీ హాలులో 45 రోజులు చేనేత కార్మికులకు ఇవ్వనున్న శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధికి, కార్మికుల జీవన స్థితిగతులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఏనాటి నుంచో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు తప్ప యువత చేనేత రంగం వైపు మక్కువ చూపడంలేదని తెలిపారు. యువత చేనేత పట్ల మక్కువ చూపేందుకు ఇలాంటి శిక్షణా శిబిరాలు దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్‌ప్రభాకర్, జేడీ కే.కన్నబాబు, డీడీ వి.భీమయ్య, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, చేనేత జౌళి శాఖ ఏడీ బి.ఉదయ్‌కుమార్, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి కే.సంజీవరావు, కే.అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న నందం అబద్ధయ్య

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మహంకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.8.13 లక్షలు

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), డిసెంబరు 5: మండలంలోని ఇసప్పాలెం గ్రామంలోని మహంకాళి ఆలయంలో గురువారం హుండీలను లెక్కించగా రూ.8.13 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి మాధవీదేవి తెలిపారు. నాలుగు నెలల కాలవ్యవధిలో రూ.8,13,981 ఆదాయం వచ్చినట్లు అధికారి మాధవీదేవి తెలిపారు.

జాతీయ స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలకు ఏఎంజీ విద్యార్థి ఎంపిక


జాన్ ఫ్రెడ్డి పాల్ మార్టిన్

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంజీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి టి జాన్ ఫ్రెడ్డిపాల్ మార్టిన్ ఇటీవల నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 నెట్‌బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొని విశేష క్రీడా ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయస్థాయి పోటీలు పంజాబ్‌లోని లూధియానాలో ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే పోటీలలో ఈ విద్యార్థి పాల్గొంటాడు. ఈ సందర్భంగా అతడిని పలువురు అభినందించారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ బింగి రామమూర్తి కన్నుమూత


బింగి రామమూర్తి

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ బింగి రామమూర్తి (86) గురువారం స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక గోల్డ్ మర్చంట్‌గా ఆయన చిరపరిచితులు. పట్టణ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్, పెద్ద అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా గతంలో ఆయన వ్యవహరించారు. రామమూర్తి మృతిపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బింగి రామమూర్తి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అర్హులైన వారికి జాబ్ కార్డులు అందజేయాలి: ఏపీవో


రొంపిచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి జాబ్ కార్డులు అందజేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ప్రసాదు గురువారం తెలిపారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. గ్రామాల్లో గుర్తించిన పనులను ఆమోదించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు సంవత్సరంలో వంద రోజులు ఉపాధి హామీ పనులు చేసిన వారి పేర్లను ఉన్నతి యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారి కుటుంబ సభ్యులు చదువుకొని ఉంటే స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. ఉపాధిహామీ పథకంలో నమోదై ఉండి చనిపోయిన వారి పేర్లను జాబ్‌కార్డుల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఈపూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, సహాయకురాలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ అరుణ తెలిపారు. అంగన్వాడీ సహాయకురాలు పోస్టులు గుమ్మనంపాడు(ఎస్సీ),కేశవానిపేట తండా (ఎస్టీ),ఊడిజర్ల(ఓసీ జనరల్), ఈపూరు మెయిన్(బీసీ-బీ)అంగలూరు(ఎస్సీ),వనికుం(బీసీ-డీ)కు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకొనే వారు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.స్థానిక వివాహ మహిళ అయి ఉండాలి.21-35 సంవత్సరాలు ఉండాలన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, మునమాక సెక్టార్ల పరిధిలో పలు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల నియామకానికి ఉత్తర్వులు వెలువడినట్టు సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి, షమీమ్ సుల్తానా గురువారం తెలిపారు. రొంపిచర్ల సెక్టార్ పరిధిలో గోగులపాడు అంగన్‌వాడీ వర్కర్, విప్పర్ల సెక్టార్ పరిధిలో సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్ నియామకానికి ఉత్తర్వులు వెలువడ్డాయి. అదేవిధంగా సుబ్బయ్యపాలెం, తురుమెళ్ళ, పరగటిచర్ల గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయాల నియామకానికి ఉత్తర్వులు వెలువడినట్టు వారు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పని దినాల్లో ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నడిగడ్డ యువకుడు మృతి


వర్ల రమేష్ (ఫైల్‌ఫొటో)

వినుకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకుతెరువుకు వెళ్ళి రోడ్డు ప్రమాదంలో నడిగడ్డ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వర్ల రమేష్ (25) 15 రోజుల క్రితం బెంగుళూరుకు ఇటుకల బట్టీలో కూలి పనులకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు రాయచూట్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతిచెందడంతో పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని స్వగ్రామమైన నడిగడ్డకు తరలించి ఖననం చేశారు. మృతుడికి భార్య జీవనజ్యోతి, కుమార్తె ఉన్నారు.

పాఠశాలల్లో శుద్ధ జలం కొరత

● ప్యూరిఫైయర్లు పంపినా పలు స్కూళ్లలో ఏర్పాట్లు నిల్
● పలుచోట్ల పనిచేయని ఆర్వో ప్లాంట్లు


రొంపిచర్ల బొడ్డురాయి సమీపంలోని ఎలిమెంటరీ పాఠశాల, పాఠశాలలో బిగించకుండా ఉన్న వాటర్ ప్యూరీ ఫైయర్

రొంపిచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు స్వచ్ఛమైన శుద్ధ జలాన్ని అందజేయాలని వాటర్ ప్లాంట్‌లను పాఠశాలలకు మంజూరు చేసింది. ఐతే రొంపిచర్ల మండలంలోని పలు పాఠశాలల్లో నేటికి విద్యార్థులకు నీటి కొరత అలానే ఉంది. కొన్ని పాఠశాలలకు ప్యూరిఫైయర్లు ఇచ్చినా అవి బిగించలేదు. దీంతో వాటర్ క్యాన్‌లలో నీటిని విద్యార్థులు వినియోగిస్తున్నారు. లేదా విద్యార్థులు బాటిళ్ళల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. రొంపిచర్లలోని బొడ్డురాయి సమీపంలోని పాఠశాల, బెహరావారిపాలెం, ఇంద్రగిరి, ముత్తనపల్లి (హెచ్), గోగులపాడు (ఎల్ఈ), వీరవట్నం (ఎస్సీ), అచ్చయ్యపాలెం, రామిరెడ్డిపాలెం (జీపీఎస్), మాచవరం (ఎస్టీ), సుబ్బయ్యపాలెం (ఎంపీపీ) పాఠశాల, రొంపిచర్ల జడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం కొరత ఉంది. ఆయా పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి నీటి కొరతతో ఇబ్బందుపడుతున్నారు.

ఆర్వో ప్లాంట్లు ఉన్నా నిరుపయోగమే

పరగటిచర్ల, గోగులపాడు (ఏఏ), నల్లగార్లపాడు, అన్నవరం, మునమాక (ఏఏ) పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు బిగించి ఉన్నా అవి పని చేయటం లేదు. అన్నవరంలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉంది. అక్కడ కూడా వాటర్ ప్లాంట్ పని చేయటం లేదు. ఆయా పాఠశాలల్లో ప్యూరిఫైర్లు, ఆర్‌వో ప్లాంట్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని, నిలిచిపోయిన ఆర్వో ప్లాంట్లను బాగుచేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పొగాకు నారుకు పెరిగిన డిమాండ్

● మార్కెట్‌లో వెయ్యి మొక్క రూ.800
● గత సంవత్సరం పంటకు మంచి ధర రావటంతో ఎక్కువ మంది రైతుల మొగ్గు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు నారు

వినుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో 25రోజుల పాటు కురిసిన వర్షాలతో పొగాకు నారు మళ్ళు దెబ్బతినడంతో ఒక్కసారిగా పొగనారు ధర ఘాటెక్కింది. దీనికి తోడు గత సంవత్సరం పొగాకు దిగుబడులు ధరల ఆశాజనకంగా ఉండడంతో రైతులు పొగాకు పంట పండించేందుకు ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. మొక్కజొన్న, మినుము, పెసర తదితర పైర్లకన్న పొగాకు పంటకే రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరుతడులకు నీరు వచ్చే పొలాల్లో పొగాకు పంట సాగుచేయడానికి రైతులు సిద్ధపడుతున్నారు. గతంలో పొగాకు వేసిన వారు వర్షం కారణంగా చాలాచోట్ల పొగాకు పంట పాడై పోయింది. ఇప్పుడు మరలా ఆ పొలాల్లోనే వ్యవసాయం చేసి పొగాకు పంటను పండించడానికి రైతులు పూనుకుంటున్నారు. గతంలో వెయ్యి మొక్క రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతోంది. వినుకొండ నియోజకవర్గంలో వినుకొండ, ఈపూరు, బొల్లాపల్లి, నూజండ్ల మండలాల్లో ఎక్కువగా పొగనారు రైతులు పెంచుతున్నారు. మండల కేంద్రమైన నూజండ్ల, ఈపూరు మండలంలోని బద్రుపాలెం, బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు, పేర్లపాడు వినుకొండ మండలంలో శివాపురం, కొత్తపాలెం, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెంలో ఎక్కువగా నారుదిబ్బలు పెట్టి నార్లు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో ఎన్నడూ లేని విధంగా శావల్యాపురం మండలంలో కూడా పొగాకు సాగుచేయడానికి రైతులు ఇష్టపడుతున్నారు. పొగనారు ధరలు పెరగటంతో పెట్టుబడి పెరిగిపోతోతందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాణ్యమైన పొగాకు మొక్క కరువు

నంద్యాలకు చెందిన ఆళ్ళ అంకయ్య కొత్తపాలెం సమీపంలోని పొగాకు దిబ్బల నుంచి ప్రతి సంవత్సరం నారు కొనుగోలుచేసి పంటలు పండిస్తున్నారు. గత సంవత్సరం పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడి ఆశించిన మేరకు లాభాలు గడించడంతో ఈ సంవత్సరం 14ఎకరాల మేరకు సాగుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎకరాకు రూ.15వేలు చొప్పున మొక్కలు కొనుగోలుచేసి నాటాల్సి వస్తుందన్నారు. గతంలో వర్షాలకు ముందు కేవలం మొక్క రూ.25 పైసలకు పలికిన మొక్క నేడు రూపాయి వెచ్చించినా నాణ్యమైన మొక్క లభ్యం కావడం లేదని రైతు తెలిపారు.

ఉపాధ్యాయుడిని హత్యచేసిన వారిని శిక్షించాలి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య డిమాండ్



డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సమాఖ్య నాయకులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై దాడిచేసి, హత్య చేసిన సంఘనలో దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, అనంతరం డీఈవో ఎల్.చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడిచేసిన సంఘటన కలచివేసిందన్నారు. ప్రధానంగా పాఠశాల ఆవాస ప్రాంతంలో గుట్కా, గంజాయి సంస్కృతి ఉన్నట్లు తెలుస్తోందని, ఆ ప్రభావం పాఠశాల మీద బాగా ఉన్నదని ఆరోపించారు. విద్యార్థులు అసహజంగా ప్రవర్తించటం, బాలికలతో అనుచితంగా వ్యవహరించడం, ఉపాధ్యాయులను కించపరచడం లాంటి విపరీత ధోరణులు పెరుగుతున్నాయన్నారు. ఈ విష సంస్కృతిని ప్రభుత్వమే నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ బీ సంపత్‌కుమార్, యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ ఎం.మోహనరావు, ఏపీటీఎఫ్ ఉస్మాన్, హెచ్ఎం అసోసియేషన్ ఆర్.గోవిందరాజులు, ఎస్టీయూ ఈ ఏమండి, ఆర్‌యూటీపీ ఎస్ఎం సుభాని, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీ ప్రేమ్‌కుమార్, కే వెంకటేశ్వరరావు, పీ సత్యానందరావు, ఎస్‌కే కరిముల్లా, పీ వెంకరెడ్డి, టీ ఆంజనేయులు, ఎస్‌కే మస్తాన్ షరీఫ్, జయశ్రీ, కే మారుతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబాన్ని ఆదుకోవాలి

శావల్యాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల దాడిలో మృతిచెందిన అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని శావల్యాపురం ఎంఆర్సీ కార్యాలయం వద్ద వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్‌లను ధరించి గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉపాధ్యాయుడి మృతికి సంతాపాన్ని తెలియజేశారు. నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ చదువు నేర్పే ఉపాధ్యాయులపై విద్యార్థులు దాడి చేయడం దారుణమని, ప్రభుత్వం విద్యార్థులను దండించే హక్కును ఉపాధ్యాయులకు కల్పించాలని, ఉపాధ్యాయుడిపై దాడి చేసిన కారకుల్ని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత ఉపాధ్యాయుడి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పరిహారాన్ని ప్రకటించేలా కృషి చేయాలన్నారు. ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కంప శ్రీనివాసరావు, రాజారమేష్, సురేష్, ప్రసాద్, రవికుమార్, గురుబాబు, రవి, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన ఎమ్మెల్యే అరవిందబాబు


పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో పారిశుధ్య పనులలో భాగంగా సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్‌లు, డామేజ్ అయిన రోడ్లు, రావిపాడు రోడ్డు బైపాస్‌లోని డంపింగ్, బరంపేట మసీదు వద్ద, కరెంట్ ఆఫీస్ వద్ద పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం పరిశీలించారు. గడ్డి, పిచ్చి మొక్కలు తీసివేసే పనులు పరిశీలించి సూచనలు చేశారు. పట్టణంలోని శివసంజీవయ్య కాలనీ, క్రిస్టియన్‌పాలెంలో తెల్లవారు జామున ఎమ్మెల్యే పర్యటించారు.

నేడు సెమీ క్రిస్‌మస్ వేడుకలు

వినుకొండ, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళ్యాణపూరి కాలనీలోని క్రీస్తు ఆశీర్వాద సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్‌మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు రెవరెండ్ పాస్టర్ పి.ఫిలిప్ గురువారం తెలిపారు. బ్లెస్సి వెస్లి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశామన్నారు.

రోడ్లపై గృహనిర్మాణ సామగ్రిని ఉంచొద్దు

● మున్సిపల్ కమిషనర్ చంద్రబోస్


గృహనిర్మాణ దారులకు సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రబోస్

వినుకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంటి నిర్మాణదారులు రోడ్లపై ఇసుక, కంకర అడ్డుగా ఉంచరాదని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో ఆయన గురువారం పర్యటించి గృహనిర్మాణ సమయంలో రోడ్లపై నిల్వ ఉంచిన ఇసుక, కంకర యజమానులకు హెచ్చరికలు జారీచేశారు. రోడ్లపై రోజులు తరబడి ఇంటి నిర్మాణ సామగ్రి ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలగడంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా వారికి తెలిపారు. ఇప్పటికైనా పట్టణంలోని గృహ నిర్మాణదారులు నెలల తరబడి రోడ్లపై ఇంటి నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచరాదని సూచించారు.

సరైన పత్రాలు లేని ఎరువుల సీజ్

నూజెండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మృత్యుంజాపురం గ్రామంలోని హరిణి ఫెర్టిలైజర్ షాపుపై రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని రూ.6.83లక్షల విలువల గల ఎరువులను సీజ్ చేసి 6(ఏ) కేసు నమోదు చేసినట్టు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీ శివాజీ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు చల్లగుడ్ల ఆదినారాయణ, మండల వ్యవసాయ అధికారి సుగుణాబేగం తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రొంపిచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బండి నిర్మల గురువారం తెలిపారు. 6వ తేదీన విప్పర్ల, 10న మాచవరం, 12న సంతగుడిపాడు, 13న ఆరేపల్లి, 17న దాసరిపాలెం, 19న రొంపిచర్ల, 21న నలగార్లపాడులలో సదస్సులు జరుగుతాయన్నారు. 24న అన్నవరం, 26న తురుమెళ్ళ, 28న అన్నవరప్పాడు, 31న అలవాల జరుగుతాయన్నారు. జనవరి 1న విప్పర్లపల్లి, 4న ముత్తనపల్లి, 7న గోగులపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

● నూజెండ్ల: మండలంలోని రైతుల రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులను శుక్రవారం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జీ రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉప్పలపాడు, 10న త్రిపురాపురం, 11న ముక్కెళ్ళపాడు, 12న నూజెండ్ల, 13 వీ అప్పాపురం, 17న కొండ్రపోలు, 18న తిమ్మాపురం, తలార్లపల్లి, 20 పువ్వాడ, 21న ములకలూరు, 24న కంభంపాడు, 26న తెల్లబాడు, 27న పమిడిపాడు, 28 టీ అన్నవరం, 31న ఐనవోలు, జనవరి 2న పెద్దవరం, జనవరి 3న చింతచెరువు, జనవరి 4న మృత్యుంజాపురం, జనవరి 7న తంగిరాల, జనవరి 8న పుచ్చనూతల, రవ్వవరం గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● బొల్లాపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఏ సుధాకర్ గురువారం పిలుపునిచ్చారు. 6వ తేదీ నుంచి బొల్లాపల్లిలో 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. 6న బొల్లాపల్లిలతో పాటు వడ్డెంగుంట, సరికొండపాలెం గ్రామాల్లో, 10న కనమలచెరువు, 11న వెల్లటూరు, 12న వెల్లటూరు, నాయుడుపాలెం, 13న పేరూరుపాడు, 17న బొల్లాపల్లి, 18న గుంట్లపల్లి, 19న గుంట్లపల్లి, పలుకూరు, 20న రేమిడిచర్ల, 21న అయ్యన్నపాలెం, 26న రావులాపురం, 27న గండిగనుముల, 28, 30 గరికపాడు, చక్రాయపాలెం, 31న మేళ్ళవాగు, 3న గుమ్మనంపాడు, 4న వడ్డెంగుంట, మూగచింతలపాలెం సచివాలయాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

ఎంపీటీ సమావేశాన్ని జయప్రదం చేయాలి: ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాల్లోని విద్యార్థుల సామర్థ్యాల గురించి తల్లిదండ్రులకు వివరించి ప్రోగ్రెస్ కార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు హాజరై సలహాలను ఉపాధ్యాయులకు అందజేయాలని కోరారు.

● ఈపూరు: ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రామతులసి తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల క్రమశిక్షణ అలవర్చుకోవడంపై పలు అంశాలు చర్చించడం జరుగుతుందన్నారు. విద్యార్థి విద్యాప్రగతి, క్రీడాప్రగతి, వ్యక్తిగత ఆరోగ్య విషయాలపై ప్రోగ్రెస్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

మొక్కలు నాటాలంటూ విద్యార్థుల ప్రదర్శన

వినుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గీతాంజలి లీడ్ స్కూల్‌లో ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు పట్టణవీదుల్లో మొక్కలను చేతబూని చిన్నారులు చేసిన ప్రదర్శ పట్టణవాసులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్కను పెంచి భవిష్యత్తు తరాలకు మంచిని చేకూర్చాలని, చెట్లను కొట్టరాదని, చెట్లను పెంచి కాలుష్యాన్ని పారదోలాలని చిన్నారులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ వైయల్ కిషోర్, డైరెక్టర్ యెండ్లూరి శేషగిరిరావు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

వినుకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం చీకటీగలపాలెం అడ్డరోడ్డు సమీపంలో బ్రిడ్జిపై బొలెరో వాహనం పంచరు అయింది. వాహనం పంచరు వేసుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. మృతులు కొత్తపాలెం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఆనంద్, వెంకటకృష్ణారెడ్డిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అందరికీ ఇక్కట్లే

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ళ పరిపాలనలో అన్నివర్గాల ప్రజలూ ఇక్కట్లు అనుభవించారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అరబిందో పాలైన పోర్టు ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. కాకినాడు పోర్టు, కాకినాడ సెజ్ వాటదారులైన కేవీ రావు, జీఎంఆర్‌ల మెడపై కత్తిపెట్టి రూ.6వేల కోట్ల ఆస్తులను రూ.506 కోట్లకే విజయసాయిరెడ్డి అల్లుడు కంపెనీ అయిన అరబిందో పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి మాఫియా రాయించుకోవటం దారుణమన్నారు. కాకినాడ పోర్టుపై జగన్‌మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి గ్యాంగ్ కన్నుపడ్డాకనే పోర్టు ద్వారా రూ.48వేల కోట్ల అక్రమ బియ్యం రవాణా జరిగిందన్నారు. అందుకు కాకినాడ పోర్ట్‌లో జరిగిన అక్రమాలపై కేవీరావు ఫిర్యాదుతో సీబీడీ కేసు నమోదు చేసిందన్నారు. ముంబైకి చెందిన ఆడిట్ సంస్థ ద్వారా తప్పుడు ఆడిట్ రాయించి ప్రభుత్వానికి రూ.వేయి కోట్లు బకాయి పడ్డారని, పోర్టులను తమ కంపెనీకి అప్పగించకపోతే కుటుంబం మొత్తం జైలుపాలు అవుతారని బెదిరించి రాయించుకున్నారని అన్నారు. సీబీడీ విచారణ త్వరగా పూర్తిచేసి చార్జిషీట్ వేయాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు శావల్యాపురం విద్యార్థిని ఎంపిక


ఆకుమల్ల సమీర

శావల్యాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం పీఎంశ్రీ హైస్కూల్ ప్లస్‌లో సీనియర్ ఇంటర్ మీడియట్ చదువుతున్న విద్యార్థిని ఆకుమల్ల సమీర ఇటీవల జరిగిన రాష్ట్ర, జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్‌వారి ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్నాటక రాష్ట్రం, కొడగుజిల్లా కుషాల్‌నగర్‌లో జరగనున్న 8వ ఫెడరేషన్ కప్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడేందుకు సమీర ఎంపికైంది. సమీరను పాఠశాల పీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.


మతుకుమల్లిలో కూలీలను విచారిస్తున్న డ్వామా పీడీ సిద్దలింగమూర్తి

ఉపాధి హామీ కూలీల వేతనాలపై విచారణ

మతుకుమల్లి (శావల్యాపురం) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతేడాది జరిగిన ఉపాధి హామీ పనుల్లో కూలీలకు వేతనాలు చెల్లించలేదని వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, ఏపీడీ బూసిరెడ్డి గురువారం మతుకుమల్లిలోని గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. గ్రామంలో సుబ్బయ్యకుంట వద్ద గతేడాది ఉపాధి పనులకు హాజరైన కూలీలను విచారించి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ గ్రామంలోని తాగునీటి పథకం దగ్గర మరమ్మతు పనులను చేయించి సుబ్బయ్యకుంట వద్ద పనిచేసినట్లుగా నమోదు చేశాడని, ఏడాది గడిచినా తమకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నాడని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కూలీలను విచారించగా రోజుకు ఎంతోమంది పనులకు వస్తారని, వారిలో ఎవరు పనికి వచ్చారో తమకు గుర్తులేదన్నారు. దీనిపై స్పందించిన డ్వామా పీడీ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి ఆయన ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ యలగాల బసవయ్య, వార్డుమెంబర్ చింతా గంగయ్య, ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో రామారావు, జేఈ సుధాకర్, టీఏ బేబీరోజ తదితరులు పాల్గొన్నారు.

8న జాతీయ ఉపకార వేతన పరీక్ష

● డీఈవో ఎల్ చంద్రకళ

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించబడుతుందని, జిల్లావ్యాప్తంగా 2745మంది విద్యార్థులు ఈ పరీక్ష రాస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రతి విద్యార్థి పరీక్షా కేంద్రానికి ఉదయం 9.30 గంటలకల్లా చేరుకోవాలన్నారు. జిల్లాలో నరసరావుపేట డివిజన్‌లో 5 పరీక్షా కేంద్రాలలో 1194, సత్తెనపల్లి డివిజన్‌లో 4 పరీక్షా కేంద్రాలలో 654, గురజాల డివిజన్‌లో 5 పరీక్షా కేంద్రాలలో 897మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూ-డైస్ కోడ్‌ను ఉపయోగించి తమ పాఠశాల విద్యార్థుల హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. నరసరావుపేట డివిజన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శంకరభారతీపురం, మున్సిపల్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రకాష్ నగర్‌లోని సెయింట్ ఆన్స్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్స్, సత్తెనపల్లి డివిజన్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు), సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుగాలీ కాలనీ), శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్‌లు, గురజాల డివిజన్‌లో గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శివాని విద్యానికేతన్, బాలజీ నగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జంగమహేశ్వరపురం), ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కేంద్రాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు.


సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ సెంటర్‌లో వేలాడదీసిన పొగాకు తాళ్ళు

పొగాకు కొష్టాలుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్

వినుకొండటౌన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటుచేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా సేకరించిన చెత్తను తడిచెత్త పొడిచెత్తగా వేరుచేసి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యూనిట్లను ఏర్పాటుచేశారు. అవి నేడు నిరుపయోగంగా మారడంతో గేదెల కొష్టాలుగాను, పొగాకు పాకలుగాను దర్శనమిస్తున్నాయి. మండలంలోని కొప్పుకొండ గ్రామ సమీపంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో పొగాకు తాళ్ళు వేలాడతీశారు. కనీసం అధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.